

మైనింగ్ మాఫియా



రోలుగుంట మండలం కొవ్వూరులో అక్రమ క్వారీ

రోలుగుంటలో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు



రోలుగుంటలోని ఒక క్వారీలో రవాణాకు సిద్ధంగా వున్న బండరాళ్లు

- అనధికారికంగా రాయి క్వారీలు నిర్వహణ
- వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతల అండదండలు
- అప్పట్లో అధికారులకు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు
- ప్రభుత్వం మారిన తరువాత కూడా ఆగని వైనం
- అక్రమార్కులకు అధికార పార్టీ నేతల దన్ను
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, పర్యావరణ శాఖల అధికారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలంలోని పలు గ్రామాల్లో నల్లరాయి అక్రమ క్వారీల్లో యథేచ్ఛగా కార్యకలాపాలు సాగుతున్నాయి. రాంబిల్లి మండలంలో నిర్మాణంలో వున్న నేవీ ప్రత్యామ్నాయ నిర్వహణ బేస్ (ఎన్‌ఏవోబీ)కు భారీ పరిమాణంలో బండరాళ్లు అవసరం ఏర్పడడంతో ఇక్కడ అనధికార క్వారీలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. రోలుగుంట మండలంలో మూడు రాయి క్వారీలకు మాత్రమే మైనింగ్ శాఖ అనుమతులు వుండగా, దీనికి ఐదు రెట్లు.. దాదాపు 14 అక్రమ క్వారీలు నడుస్తున్నాయి. వీటికి నర్సీపట్నం, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన కూటమిలో ఒక పార్టీ నేతలు అండదండలు వున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో వైసీపీ అధికారంలో వున్నప్పుడు ఈ క్వారీలు వైసీపీ నేతల చేతుల్లో వుండగా, రాష్ట్రంలో అధికారం మారినట్టే.. ఇక్కడ రాయి క్వారీలు చేతులు మారాయి.

అనకాపల్లి మండలం తరువాత రోలుగుంట మండలంలోనే అత్యధికంగా నల్లరాయి కొండలు ఉన్నాయి. వైసీపీ అధికారంలో వున్నప్పుడు ఆ పార్టీ నేతలు, మైనింగ్ మాఫియాతో చేతులు కలిపి, మైనింగ్ శాఖ నుంచి అనుమతులు లేకుండా కొండలను తొలిచి రాళ్లు, రోడ్డు మెటల్, కంకర భారీఎత్తున అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. అక్రమ మైనింగ్‌పై అప్పట్లో టీడీపీ నాయకులు, ప్రజా సంఘాల నేతలు అనేకమార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఒక్కసారి కూడా క్వారీలను సందర్శించలేదు. పైగా ఫిర్యాదులను బుట్టదాఖలు చేశారు. గత ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట పడుతుందని అంతా భావించారు. కానీ ప్రభుత్వం మారినా.. అక్రమ మైనింగ్ ఆగలేదు. నర్సీపట్నం, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన అధికార పార్టీ నాయకులు రాయి క్వారీలను పంచుకుని మైనింగ్‌ను కొనసాగిస్తున్నారు. వాస్తవంగా రోలుగుంట మండలంలో మూడు నల్లరాయి క్వారీలకు మాత్రమే మైనింగ్ శాఖ అనుమతులు వున్నాయి. కానీ రోలుగుంట, నిండుగొండ, కె.నాయుడుపాలెం, కొవ్వూరు, వడ్డిప, రాజన్నపేట గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా మరో 14 నల్లరాయి క్వారీల్లో అక్రమ మైనింగ్ జరుగుతున్నది. బోరు బ్లాస్టింగులతో కొండలను తొలిస్తున్నారు. రాజన్నపేటలో రాయిక్వారీకి వాహనాల రాకపోకల కోసం చెరువు గర్భం మీదుగా రోడ్డు వేశారు.

రోలుగుంట టు రాంబిల్లి...

రాంబిల్లి మండలంలో నేవీ ప్రత్యామ్నాయ నిర్వహణ బేస్ (ఎన్‌ఏవోబీ) నిర్మాణ పనులు ... మిగతా 6వ పేజీలో

అంగరంగ వైభవంగా..



బాలాలయంలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న నూకాంబిక అమ్మవారు

అనకాపల్లిలో నూకాంబిక కొత్త అమావాస్య జాతర ప్రారంభం

- తొలిపూజ చేసిన ఎమ్మెల్యే కొణతాల, పీలా గోవింద
- అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు



అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరిన భక్తులు

అనకాపల్లి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారి జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో అందుకు తగ్గట్టుగా ఆలయంలో ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో తీర్చిదిద్దారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ.. అర్చకుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరను ప్రారంభించారు. అంతకు ముందు ఆలయానికి చేరుకున్న వీరికి ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఉత్సవ ప్రత్యేకాధికారి కె.శోభారాణి, ఈవో వెంపలి రాంబాబు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానికి పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన నేలవేషాలు ఆకట్టుకున్నాయి. పలుచోట్ల ఏర్పాటు చేసిన విద్యుత్ సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఎన్టీఆర్ స్టేడియంలో..

స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నూకాంబిక అమ్మవారి జాతరను శుక్రవారం రాత్రి ప్రారంభించారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన వేదికపై నూకాంబిక అమ్మవారి భారీ ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి బీమరశెట్టి రామకృష్ణ(రాంకీ) పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వినతి మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సానుకూలంగా స్పందించి నూకాంబిక అమ్మవారి జాతరను రాష్ట్రస్థాయి పండుగగా ప్రకటించారని అన్నారు. ఇక్కడ వేదికపై 30 రోజులపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి, కండేపల్లి మురళీలను ఆయన సత్కరించారు. అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని బృంద సభ్యుల భక్తి గేయాలతో కార్యక్రమం ప్రారంభమైంది. చిన్నారులు కూచిపూడి నృత్యప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, కూటమి నాయకులు డాక్టర్ నారాయణరావు, బీఎస్ఎంకే జోగినాయుడు, తాడి రామకృష్ణ, సకల గోవిందరావు, కాండ్రేగుల శ్రీరామ్, ఆళ్ల రామచంద్రరావు, డాక్టర్ డీడీ నాయుడు, బొడ్డేడ మురళీ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ స్టేడియంలో నూకాంబిక అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించిన కూటమి నాయకులు

మార్కెట్ కమిటీలకు కొత్త సారథులు

- నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్‌గా రుత్తల శేషుకుమార్
- ఎలమంచిలి చైర్‌పర్సన్‌గా తట్టా లోవకుమారి
- ఒకరు టీడీపీ, మరొకరు జనసేన

నర్సీపట్నం/ అచ్యుతాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):



రుత్తల శేషుకుమార్, నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్



తట్టా లోవకుమారి, ఎలమంచిలి ఏఎంసీ చైర్‌పర్సన్

జిల్లాలో నర్సీపట్నం, ఎలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్త చైర్మన్/ చైర్‌పర్సన్ లను కూటమి ప్రభుత్వం నియమించింది. నర్సీ పట్నం ఏఎంసీ చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీకి చెం దిన మాకవరపాలెం మం డలం సీనియర్ నాయ కుడు రుత్తల శేష కుమార్ ఎంపికయ్యారు. టీడీపీ మండల అధ్యక్షుడి, మాకవరపాలెం సర్పంచ్‌గా, జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారు. దాదాపు 25 ఏళ్ల నుంచి పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించిన అధిష్ఠానం.. ఆయనకు నర్సీపట్నం ఏఎంసీ పదవిని అప్పగించి తగిన న్యాయం చేసిందని స్థానిక టీడీపీ నాయకులు అంటున్నారు. కాగా కాలేయ సంబంధ వ్యాధితో బాధపడుతున్న శేషుకుమార్ కొద్ది రోజుల నుంచి విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

కాగా ఎలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అచ్యుతాపురం మడుతూరు గ్రామానికి తట్టా లోవకుమారి నియమితులయారు. బీఎస్సీ, బీఈడీ చదివిన ఆమె జనసేనలో చురుకైన కార్యకర్తగా వున్నారు. ఈమె భర్త శ్రీనివాసరావు న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఒక సామాన్య కార్యకర్త అయిన తనకు నియోజకవర్గంస్థాయి నామినేటెడ్ పదవి ఇచ్చినందుకు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు రుణపడి వుంటానని ఆమె పేర్కొన్నారు. తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ పదవికి న్యాయం చేస్తానని లోవకుమారి అన్నారు.

కొత్తూరు వంతెనకు ముప్పు

అడుగడుగునా గోతులతో అధ్వానం

- కాంక్రీట్ లేచిపోయి బయటపడిన ఇనుప ఊచలు
- వర్షం కురిస్తే పరిస్థితి మరింత దారుణం
- ఇబ్బంది పడుతున్న 30 గ్రామాల ప్రజలు



గత సోమవారం కురిసిన వర్షంతో గోతుల్లో నిలిచిన నీరు

కొత్తూరు (అనకాపల్లి), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): **రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే కొత్తూరు వంతెన గోతులు ఏర్పడి ఛిద్రంగా మారింది. రాళ్లు లేచిపోయి అధ్వానంగా తయారైంది. వర్షం కురిస్తే పరిస్థితి మరింత దారుణంగా వుంటున్నది. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకపోయినా.. కనీసం గోతులు అయినా పూడ్చాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.**

అనకాపల్లి పట్టణాన్ని ఆనుకుని వున్న కొత్తూరు పంచాయతీ పరిధిలోని కాలేజీ రోడ్డు వంతెన మీదుగా అనకాపల్లి, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని సుమారు 30 గ్రామాల



గోతులతో అధ్వానంగా తయారైన కొత్తూరు వంతెన

ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం, వైద్యం న నిమిత్తం నిత్యం వేలాది మంది వచ్చిపోతుంటారు. ఇంకా రైతులు వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకోవడానికి, పంటలకు అవసరమైన ఎరువులు, ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు అనకాపల్లి వస్తుంటారు. నిత్యం రద్దీగా వుంటే ఈ మార్గాన్ని.. ప్రధానంగా వంతెనను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఐదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా నిర్వహణ పనులు చేయించలేదు. దీంతో రానురాను గోతులు అధికమై, ఇనుప ఊచలు బయటపడ్డాయి. . రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌పై పలకలు ధ్వంసమయ్యాయి. గోతులను తప్పించే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

భారీ వాహనాలతో ధ్వంసం

కశింకోట- బంగారుమెట్ట రోడ్డులో పలుచోట్ల రాయి, మెటల్ క్వారీలు వున్నాయి. పరిమితికి మించిన బరువుతో టిప్పర్లు, లారీలు ఈ వంతెన మీదుగానే వెళుతుంటాయి. దీంతో వంతెన త్వరగా పాడైపోతున్నది. బ్రిడ్జిపై సిమెంట్ కాంక్రీట్ లేచిపోయి ఇనుప ఊచలు ప్రమాదకరంగా బయటకు కనిపిస్తున్నాయి. భారీ వాహనాల రాకపోకలను నియంత్రించకపోతే వంతెన కూలిపోయే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏసీబీ వలలో నక్కపల్లి ఆర్‌ఐ

- రైతుల నుంచి రూ.12 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
- పొలంలో బోరు వేసుకోవడానికి అనుమతి కోసం లంచం డిమాండ్



లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయిన ఇన్‌ఛార్జి ఆర్‌ఐ కన్నబాబు

నక్కపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): **వ్యవసాయ పొలంలో బోరు వేయడానికి అనుమతి కోసం రైతుల నుంచి లంచం తీసుకుంటుండగా ఇన్‌చార్జి ఆర్‌ఐ కన్నబాబును శుక్రవారం మధ్యాహ్నం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇందుకు డీఎస్పీ ఎన్.రమ్య మీడియాకు తెలిపిన వివరాలిలా వున్నాయి.**

నక్కపల్లి మండలంలోని ఒక గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు ... మిగతా 6వ పేజీలో

ప్రేమికుల ఆత్మహత్య

ఆమె మైనర్.. అతనికి అంతకుముందే వివాహం

- బాలికను చేసుకునేందుకు నెల కిందట విడాకులు
- విశాఖలోని వడ్లపూడిలో సంఘటన - 6లో

బెల్లం మార్కెట్ అభివృద్ధికి చర్యలు

- రైతు బజార్ ఏర్పాటు చేసే యోచన
- కలెక్టర్ విజయకృష్ణన్



మార్కెట్ యార్డులో కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి బెల్లం మార్కెట్‌ను ... మిగతా 6వ పేజీలో

'సింహాద్రి'లో కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి

- పలు విభాగాలను పరిశీలించిన శ్రీపాద్ యెస్సో నాయక్



కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యెస్సో నాయక్‌కు మొక్క అందజేస్తున్న ఎన్టీపీసీ ఉద్యోగులు. పక్కన సింహాద్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ

పరవాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యెస్సో నాయక్ శుక్రవారం సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లో పర్యటించారు. తొలుత సింహాద్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సమీర్‌శర్మ మంత్రికి పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ప్లాంట్‌లోని పలు విభాగాలను మంత్రి పరిశీలించారు. పవర్ కంట్రోల్‌రూముతోపాటు సోలార్ ఫ్లోటింగ్ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఈడీ సమీర్‌శర్మ ప్లాంట్ పనితీరు గురించి మంత్రికి వివరించారు. సీఎస్ఆర్ నిధులతో చుట్టుపక్కల గ్రామాల్లో చేపడుతున్న సామాజిక కార్యక్రమాల గురించి తెలియపరిచారు. అనంతరం మంత్రి స్థానిక దీపాంజలి నగర్‌లోని సముద్రిక అతిథిగృహం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వెదురువాడ ఉప సర్పంచ్ పదవి కూటమి కైవశం

▸▸ బెడిసికొట్టిన వైసీపీ వ్యూహం



రాజేష్ వర్మకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎన్నికల అధికారి

అచ్యుతాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెదురువాడ పంచాయతీ ఉప సర్పంచ్ స్థానాన్ని కూటమి కైవశం చేసుకుంది. ఈ పదవి కోసం వైసీపీ క్యాంపు రాజకీయం చేసినా ఫలితం దక్కలేదు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో పది మంది వార్డు సభ్యుల్లో ఆరుగురు హాజరయ్యారు. సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావుతో సంఖ్య ఏడుగురు కావడంతో కోరం సరిపోవడంతో ఎన్నికల అధికారి శ్రీరామనాయుడు ఎన్నిక ప్రక్రియను పూర్తిచేశారు. సభ్యులంతా బుద్ధరాజు రాజేష్ వర్మను ఏకగ్రీవంగా ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. రెండు రోజులుగా ఈ ఎన్నిక పై ఉత్కంఠ నెలకొంది. వైసీపీ నాయకులు ఏడుగురు సభ్యులతో క్యాంపు రాజకీయం చేశారు. నిజానికి గురువారం ఈ ఎన్నిక జరగాల్సి ఉంది. వైసీపీ నాయకులకు, కూటమి నాయకులకు గొడవ జరగడంతో ఎన్నికల అధికారి తీవ్ర అస్వస్థతకు గురై ఎన్నిక శుక్రవారానికి వాయిదా వేశారు. రాత్రికి రాత్రి పరిస్థితి తారుమారైంది. శుక్రవారం ఉదయం 11 నుంచి 12 వరకు ఎన్నికల ప్రక్రియ జరగాల్సి ఉంది. ఉదయం పది గంటలకే ఎన్నికల అధికారితో పాటు పోలీసులు వెదురువాడ సచివాలయం వద్ద మోహరించారు. 11 గంటలకు ఆరుగురు వార్డు సభ్యులు హాజరయ్యారు. నిజానికి కూటమి అనుకూలమైన సభ్యులు నలుగురు మాత్రమే. కానీ ఆరుగురు హాజరయ్యారు. వైసీపీ అనుకూలురైన ఐదవ వార్డు సభ్యుడు కారుకుండి శ్రీను, పదవ వార్డు సభ్యుడు కేకే కృష్ణమూర్తి రాజు కూటమి సభ్యులకు మద్దతు ఇవ్వడంతో ఎన్నిక సజావుగా సాగింది. కూటమి విజయం సాధిస్తుందని ముందుగానే తెసుకున్న నాయకులు, శ్రేణులు ఉదయం పది నుంచి భారీగా వెదురువాడ సచివాలయం వద్దకు చేరుకున్నారు. కానీ పోలీసులు వీరిని దూరంగా తరిమేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే కూటమి శ్రేణులు విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, రాజాన రమేష్ కుమార్, రాజాన సన్యాసి నాయుడు, బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి నర్సింగరావు, కరెడ్ల సూర్యప్రకాష్, డ్రీమ్స్ నాయుడు, కూనిశెట్టి రమణ, పుర్రే శ్రీనివాసయాదవ్, కె.పవన్ విజయ్, కూండ్రపు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ నిలిచిన మునగపాక ఉప సర్పంచ్ ఎన్నిక



వార్డు సభ్యుల కోసం ఎదురు చూస్తున్న ప్రిసైడింగ్ ఆఫీసర్ సోమరాజు

మునగపాక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ మునగపాక ఉప సర్పంచ్ పదవికి జరగాల్సిన ఎన్నిక మళ్లీ నిలిచిపోయింది. గురువారం వాయిదా పడిన ఎన్నిక ప్రక్రియను తిరిగి శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ప్రిసైడింగ్ ఆఫీసర్ సోమరాజు ప్రారంభించారు. కానీ రెండో రోజు కూడా సర్పంచ్‌తో సహా వార్డు సభ్యులు ఎవరూ హాజరు కాలేదు. దీంతో ఆయన చూసి చూసి సమయం మించిపోవడంతో వెనుదిరిగారు. ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లా పంచాయతీరాజ్ అధికారికి అందజేయనున్నట్టు చెప్పారు.

బోనమెత్తిన ఎలమంచిలి

▸▸ కొత్త అమావాస్య వేడుకలు ఆరంభం ▸▸ నూకాంబిక ఆలయం నుంచి పురవీధుల గుండా ఊరేగింపు ▸▸ ప్రత్యేక ఆకర్షణగా వేషధారణలు



ఎలమంచిలిలో కొలువుదీరిన నూకాంబిక



బోనాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా బయల్దేరిన మహిళలు, నిర్వాహక కమిటీ సభ్యులు

ఎలమంచిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బోనాల సందడి ఆరంభమైంది. కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఇక్కడి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల నూకాంబిక ఆలయం వద్ద కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఈ జాతరను ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులంతా బోనాలను తలపై పెట్టుకుని అమ్మ నామాన్ని స్మరించుకుంటూ మేళతాళాలు, బాజా భజంత్రీలతో ఊరేగింపుగా ముందుకు సాగారు. ఆలయం వద్ద నుంచి ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం మీదుగా కాకివాని వీధి, కోమటి పేట, సతకంపట్టుతో పాటు ప్రధాన రోడ్డు మీదుగా తిరిగి ఆలయానికి ఊరేగింపు చేరుకుంది. ఈ సందర్భంగా చిన్నారుల అమ్మవారి వేషధారణలు, మహిళల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఆలయంలో అమ్మవారికి బోనాలను నైవేద్యంగా



సమర్పించారు. శనివారం ఆలయంలో కొత్త అమావాస్య సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టడంతో పాటు కుంకు మార్చనలు జరపనున్నారు. ఈ వేడుకల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాలు విద్యుద్దీపాలంకరణతో ధగధగలాడుతున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.

వేడుకలకు ఆలయాలు ముస్తాబు

రాంబిల్లి : కొత్త అమావాస్య పూజలకు మండలంలోని పలు గ్రామాల్లో గల నూకాంబిక అమ్మవారి ఆలయాలు ముస్తామయ్యాయి. శనివారం వెల్చూరు, రాజుకోడూరు, అప్పారాయుడుపాలెం, కొప్పుగొండుపాలెం, దిమిలి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు జరగనున్నాయి. ఈ వేడుకల సందర్భంగా ఏ గ్రామం చూసినా కోలాహలంగా కనిపిస్తోంది. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.

'ప్రతి గ్రామం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కావాలి'



సర్పంచులు, కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు

రాంబిల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామాన్ని స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రగా తీర్చిద్దాలని ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఎస్ఈజడ్‌లోని లారస్ కంపెనీ ట్రైనింగ్ హాలులో శుక్రవారం రాంబిల్లి, ఎలమంచిలి మండలాల సర్పచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతకు అంతా అధిక ప్రాధాన్యం ఇచ్చేలా తీర్చిదిద్దాలన్నారు. గ్రామాలను ఆరోగ్యవంతంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిదిగా పేర్కొన్నారు. గ్రామాల్లోని ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించే విధంగా చైతన్య వంతులను చేయాల న్నారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి, పలు శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

పండు మిర్చి ధర పెరగడంతో రైతులు ఆనందం

▸▸ సంతలో రూ.100 నుంచి 130కి విక్రయాలు



సంతలో విక్రయానికి తెచ్చిన పండు మిరప

అచ్యుతాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి వారపు సంతలో పండుమిర్చి ధర పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గత రెండు వారాల నుంచి మిర్చికి సరైన ధర లేకపోవడంతో వారు నిరశకు గురయ్యారు. అచ్యుతాపురంలో ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో కూరగాయల సంత జరుగు తుంది. గత రెండు వారాల్లో మిర్చి కేజీ ధర రూ.60 నుంచి రూ.80 వరకు ఉంది. కానీ ఈ శుక్రవారం సంతలో పొడవు పండు మిరప కాయలురూ.100, పొట్టి మిరప కాయలు రూ.130 ధర పలికింది. రైతులు సరుకు తెచ్చిన కొద్ది సేపటికే హాట్ కేకుల్లా అమ్ముడు పోవడంతో వారి ముఖాల్లో ఆనందం కనిపించింది.

31న మంత్రి లోకేశ్‌తో సమావేశం

▸▸ టీడీపీ శ్రేణులంతా హాజరు కావాలి : ప్రగడ

అచ్యుతాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం అచ్యుతాపురంలో గల లేపాక్షి కల్యాణ మండపంలో ఈనెల 31వ తేదీ సోమవారం మంత్రి నారా లోకేశ్‌తో సమావేశం ఉందని ఆంధ్రప్రదేశ్ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం మూడు వరకు జరగనున్న ఈ సమావేశానికి ఎలమంచిలి నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులంతా హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

మామిడివాడలో ఘనంగా పైడితల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



రాంబిల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడివాడ గ్రామంలో పైడితల్లమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు వి.దిన్‌బాబు, మాజీ సర్పంచ్ చదరం సూరిబాబు, మామిడివాడ జనసేన అధ్యక్షుడు బద్ధి మహేష్, బాబా కెనాల్ కాలువ ఛైర్మన్ ఆకుల మంగరాజుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన జరిపారు.

పెదపల్లిలో శ్రీరామ నవమి ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ఎలమంచిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధి పెదపల్లిలో శ్రీరామ నవమి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం గ్రామ పెద్దలు, ఆలయ ధర్మకర్తల ప్రతినిధుల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా ఈ వేడకను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వచ్చేనెల ఆరో తేదీన ఈ ఉత్సవం జరగనుందన్నారు. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టనున్నామన్నారు. మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, కొక్కిరాపల్లి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దాసరి కుమార్, మాజీ సర్పంచ్ కోడిగుడ్డు రమణబాబు, మాజీ కౌన్సిలర్ బొద్దపు నాగేశ్వరరావు, ఆలయ ధర్మకర్త బీఎల్‌పీ రాజుతో పాటు స్థానిక నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, పప్పు ఈశ్వరావు, నమ్మి రమణ, ప్రకాశ్, శ్రీను, ఈశ్వరావు, గణేశ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులు శాంతి ర్యాలీ

ఎలమంచిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ పగడాల కేసులో ప్రభుత్వం జోక్యం చేసుకుని నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపించాలని కోరుతూ ఎలమంచిలిలో శుక్రవారం పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆంధ్ర సెంటినరీ బాప్టిస్టు సంఘం, వైఎంపీఎఫ్, ఎలమంచిలి పట్టణ క్రైస్తవ సమాఖ్యల ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పాస్టర్లు, సంఘ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

వేంపాడులో నూకాలమ్మ జాతర

అలరించిన పండ్ల అలంకరణ.. భక్తులతో నిండిన క్యూ లైన్లు



వేంపాడు నూకాలమ్మ ఆలయం వద్ద భక్తులతో నిండిపోయిన క్యూ లైన్లు... (ఇన్‌సెట్‌లో) భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

నక్కపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు గ్రామంలో నూకాలమ్మ జాతర శుక్రవారం ఘనంగా జరిగింది. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంలో చేసిన పుష్పాలంకరణ, పండ్ల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనేక గ్రామాల నుంచి భక్తులు వేంపాడు తరలివచ్చారు. బాణసంచా పేలుళ్లు, లైటింగ్ ఆకట్టుకున్నాయి. నూకాలమ్మ ఆలయంలోని క్యూ లైన్లన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. సుమారు పది వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. మండలంలోని పలు పార్టీల నాయకులు అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు.

పాయకరావుపేటలో...



బండి మహంకాళమ్మను దర్శించుకుంటున్న చిక్కాల రామారావు తదితరులు

పాయకరావుపేట రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో కొత్త అమావాస్య పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని నూకాలమ్మ ఆలయాల్లో అమ్మవార్లను విశేషాలంకరణచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ముడుపులు సమర్పించుకున్నారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవార్ల ఆలయాలు భక్తులతో రద్దీగా కనిపించాయి. మండలంలోని రాజవరం గ్రామంలో వేంచేసిన బండి మహంకాళమ్మ అమ్మవారిని వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, డక్కన్ కెమికల్స్ అధినేత కె.వెంకట లక్ష్మీపతిరాజు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకుని అమ్మవార్ల ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు.

నేడు కొత్త అమావాస్య వేడుకలు



నూకాంబిక అమ్మవారు

ఎస్. రాయవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కొత్త అమావాస్య వేడుకలు జరగనున్నాయి. తిమ్మాపురం, గెడ్డపాలెం, చినగుమ్ములూరు, కోనవానిపాలెం, పెట్టుగోళ్లపల్లి, సర్వసిద్ధి, వేమగిరి తదితర గ్రామాల్లో కొత్తమావాస్య జాతరను ఆయా గ్రామాల ప్రజలు ఎంతో ఘనంగా జరుపుకోనున్నారు. ఇందుకు సంబంధించి నూకాంబిక ఆలయాల వద్ద నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి ఆలయాలను పూల దండలు, విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. అంతేకాకుండా గ్రామాల్లో పలు రకాల విద్యుత్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు.

పైసలు ఇవ్వందే అక్కడ ఫైలు కదలదు!

▸▸ ఇదీ నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయ పరిస్థితి

▸▸ ప్రజా ప్రతినిధులైనా ముడుపులు ఇవ్వాల్సిందే..!

▸▸ వరుస దెబ్బలు తగులుతున్నా కనిపించని మార్పు



నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం

నక్కపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయంలో పని చేయడమంటే కొందరు ఉద్యోగులు అఖండ యోగం పట్టినట్టేనని భావిస్తున్నారు. దాదాపు పదేళ్ల నుంచి నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. దీనికి కారణం విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ 2015 నుంచి భూములు సేకరించడం, తాజాగా బల్క్‌డ్రగ్, స్టీల్‌ప్లాంట్‌కు భూ సేకరణ జరుగుతుండడంతో రెవెన్యూ ఉద్యోగులకు ఒక వరంగా మారడమే. ఇప్పటికే విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా రాజయ్యపేట, డీఎల్‌పురం, వేంపాడు, బుచ్చిరాజుపేట, చందనాడ, అమలాపురం, బోయపాడు, పాటిమీద, మూలపర్ర గ్రామాల్లో ప్రభుత్వ, జిరాయితీ భూములను ప్రభుత్వం సేకరించింది. ఇక్కడే అనేక అవకతవకలు జరిగాయి. నందిని పంది, పందిని నంది చేయగల సమర్థత గల కొందరు రెవెన్యూ ఉద్యోగులు గత కొన్నేళ్లుగా రికార్డులు టాంపరింగ్ చేయడం, గుట్టుచప్పుడు గాకుండా 1బీ అడంగళ్లు మార్చేసి, ఇదే అవకాశంగా అందినంత కానుకలు పుచ్చుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పలు సందర్భాల్లో రాజకీయ ఒత్తిడి కారణంగా కొన్ని పనులను ఉభయతారకంగా చేసేశారు. అనేక మంది నిరుపేదలకు చెందిన వారి భూములు, ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల్లో వున్నట్టు, డీ పట్టాదారులుగా కూడా పేర్లు నమోదు చేయించుకుని కొందరు నాయకులు రూ.కోట్లలోనే లాభపడ్డారు. గ్రామ స్థాయి నుంచి డివిజన్ స్థాయి అధికారుల కనుసన్నల్లోనే ఈ తంతును నడిపించేశారు. ఇదే అదునుగా భూముల రికార్డుల మార్పులు, చేర్పులు, సర్వేలు, ఇలా ఒకటేమిటి? రెవెన్యూ పరిధిలో ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించేశారనే ప్రచారం జోరుగా జరుగుతోంది. గతంలో నలుగురు రెవెన్యూ ఉద్యోగుల అక్రమాలు బయటపడడంతో వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అయినా అక్రమాలకు పాల్పడే రెవెన్యూ ఉద్యోగుల్లో అదురు బెదురు లేకుండా పోయింది. ఒకసారి మండలంలో పోస్టింగ్ వస్తే, పంట పండినట్టేనని భావిస్తున్నారు. పలుమార్లు మండల సర్వసభ్య సమావేశాల్లో కొందరు ప్రజాప్రతినిధులు కూడా ఆవేదన వెలిబుచ్చినప్పటికీ అరణ్యరోదనగానే మారుతోంది. ఏదేమైనా ఈ కార్యాలయంలో దశాబ్ద కాలం నుంచి పైసలిస్తేనే తప్ప పనులు కావడం లేదనే ప్రచారం సాగుతోంది. తాజాగా ఇన్‌చార్జి ఆర్ఐ కన్నబాబు రూ.12 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన సంఘటన ఈ వాదనలకు మరింత బలం చేకూర్చుతోంది.

సారా రహిత ఏపీగా మార్చడానికి కృషిచేయాలి

▸▸ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ

▸▸ 'పేట'లో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం



ఎక్సైజ్ అధికారులతో సమీక్షిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ

పాయకరావుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0ను సమర్థవంతంగా నిర్వహించి రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌ను నాటుసారా రహిత రాష్ట్రంగా మార్చడానికి అధికారులు కృషిచేయాలని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ సూచించారు. పాయకరావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ఎక్సైజ్ శాఖ అధికారులతో గురువారం రాత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నవోదయం 2.0 కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి సారా, గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల వల్లకలిగే నష్టాలు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. తద్వారా వాటికి దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే సారా తయారీ, రవాణా, విక్రయాలు జరుపుతున్నవారిని, వాటికి దూరంగా ఉండేలా చైతన్యం తీసుకురావడంతో పాటు వారికి పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం నవోదయం 2.0లో నాటుసారాను ఏ విధంగా అరికట్టాలనే దానిపై ఎస్‌హెచ్‌వోల నుంచి యాక్షన్ ప్లాన్ అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌ను నాటుసారా, గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఏ విధంగా మార్చాలో దశదిశా నిర్దేశం చేశారు. అంతకుముందు అమరావతి నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆయన, పాయకరావుపేటలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సురిజిత్‌సింగ్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ వి.సుధీర్, ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు, అనకాపల్లి, ఏఎస్ఆర్ జిల్లాల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

పాములవాకలో రీ సర్వేపై గ్రామసభ



పాములవాకలో రీ సర్వే అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోటవురట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములవాక గ్రామంలో భూముల రీ సర్వేపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ తిరుమలబాబు మాట్లాడుతూ ఈ గ్రామంలో భూ రీ సర్వే ప్రక్రియ వారం రోజుల్లో ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. భూ వివాదాల పరిష్కారానికి భూ సర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రైతు పాసు పుస్తకం, ఫోన్ నంబర్, ఫొటో, ఆధార్‌కార్డు ఫొటో తప్పనిసరిగా తీసుకొని వచ్చి రెవెన్యూ సిబ్బందికి అందజేయాలన్నారు. రైతులు భూ సమస్యల పరిష్కారానికి ఈ రీ సర్వే కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు, నాయకులు వేచలపు జనార్దన్, బాస్కరరావు, మండల సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

దొంగ మస్తర్లు వేస్తే చర్యలు తప్పవు

▸▸ డ్వామా పీడీ పూర్ణిమాదేవి

మాకవరపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కూలీలు పనులు రాకుండా దొంగ మస్తర్లు వేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టరు పూర్ణిమాదేవి హెచ్చరించారు. మండలంలోని 31 పంచాయతీల్లో రూ.20.37 కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలపై శుక్రవారం ప్రజావేదిక నిర్వహించారు. బూరుగుపాలెంలో జరిగిన ఉపాధి పనుల్లో ఎంబుక్ కాకుండానే నగదు పంపిణీ చేశారని, తూటిపాలలో పనులకు రాకుండానే రూ.11,900 డ్రా చేశారని, పది మందికి పనులు కల్పించలేదని తమకు ఫిర్యాదులు అందాయని రిసోర్సుపర్సన్లు తెలిపారు. దీంతో తూటిపాల వీఆర్‌పీపై పీడీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అలాగే మరికొన్ని గ్రామాల్లో గృహ నిర్మాణాలకు సంబంధించి రికార్డు కాకుండానే బిల్లులు ఎందుకు డ్రా చేశారని హౌసింగ్ సిబ్బందిని ప్రశ్నించారు. కాగా వీపీ అగ్రహారం, టీఎస్ పేట, జి.గంగవరంతో పాటు మరికొన్ని గ్రామాల్లో చేసిన పనులకు ఆనవాళ్లతో పాటు పని బోర్డులు ఏర్పాటు చేయలేదని, చాలా చోట్ల పాత ఫొటోలు పెట్టారని సోషల్ ఆడిట్ సిబ్బంది తెలిపారు. చాలా చోట్ల మొక్కలు చనిపోతున్నా సంరక్షణ చర్యలు సక్రమంగా చేపట్టడం లేదని తెలపగా, ఫారెస్టు సిబ్బందిని పీడీ నిలదీశారు.

జిల్లాలో కోటి 27 లక్షల పని దినాలు

జిల్లాలో ఈ ఏడాది కోటి 27 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించామని డ్వామా పీడీ పూర్ణిమాదేవి తెలిపారు. ఏప్రిల్‌లో ప్రతీ పంచాయతీలో పశువులకు నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వేసవిలో రూ.290 నుంచి రూ.300 వేతనం వచ్చేలా పని దినాలు చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీతమహాలక్ష్మి, ఏపీడీ చిన్నారావు, ఏపీవో వరలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

సకాలంలో విత్తనాలు అందించండి

▸▸ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో విత్తనాలు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం క్యాంప్ ఆఫీసులో వ్యవసాయ అధికారులతో మాట్లాడారు. ఉగాది తర్వాత ఏరువాక మొదలయ్యే నాటికి రైతులకు అవసరమైన విత్తనాలు సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయ యంత్ర పరికరాలు ప్రదర్శన ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌జేఎల్, సాంబ మసూరు విత్తనాలు సరఫరా చేయాలని ఆదేశించారు. తక్కువ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడినిచ్చే కొత్తరకం విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు చెప్పారు.

సమగ్ర శిక్ష అధికారులతో సమీక్ష

నియోజకవర్గంలోకి కేజీబీవీ జూనియర్ కళాశాలల భవనాలకు రూ.1.2 కోట్లు మంజూరయ్యాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పారు. సమగ్ర శిక్ష అధికారులతో ఆయన మాట్లాడుతూ మాకవరపాలెం, నాతవరం, వేములపూడిలో శంకుస్థాపనలకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏడీ శ్రీదేవి, ఏవో అప్పారావు, సమగ్ర శిక్ష డీఈఈ సబ్బలక్ష్మి, ఏఈ రమణాజి తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురండి: డీపీవో శిరీషారాణి



గుండుపాలలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో

గొలుగొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని సచివాలయాల్లో సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి ఆదేశించారు. మండలంలోని గుండుపాల గ్రామ సచివాలయంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో వర్మీ ఎరువుల తయారీపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. దీనిపై ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. సంపద కేంద్రాలు వినియోగించకపోతే సంబంధిత కార్యదర్శులపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అలాగే తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో మూర్తి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కిరణ్మయి పాల్గొన్నారు.

పది పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

▸▸ జిల్లా విద్యా శాఖాధికారి అప్పారావునాయుడు

చీడికాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని జిల్లా విద్యా శాఖాధికారి అప్పారావు నాయుడు ఆదేశించారు. శుక్రవారం ఉదయం కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ నుంచి పరీక్షా కేంద్రాలకు పేపర్లు తీసుకువెళ్లి, తిరిగి పోస్టాఫీసలకు వెళ్లే వరకూ బందోబస్తు ఇవ్వాలని సూచించారు. కేంద్రాల వద్ద ఎవరూ ఉండకుండా, కుటుంబ సభ్యులు దరిచేరకుండా చూడాలని ఆదేశించారు. మాల్‌ప్రాక్టీస్ జరిగినట్టు సమాచారం వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం చీడికాడ, కోనాం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అంతకుముందు చీడికాడ ఎలిమెంటరీ పాఠశాలను ఉదయం 8.30 గంటలకు తనిఖీ చేశారు.

సాధికార సారథులను నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ

నాతవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతీ 60 మంది ఓటర్లకు ఓ సాధికార సారథిని నియమించి పార్టీకి బలమైన పునాదులు ఏర్పాటు చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ సూచించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధికార సారథుల్లో ఒక పురుషుడు, ఒక మహిళను నియమించుకోవాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసే వారికి ఈ అవకాశం కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, ఎన్.విజయ్‌కుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు ఇనపసప్పల సత్యవతి, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండ్రు మరిడియ్య, నాయకులు అప్పిరెడ్డి మాణిక్యం, జీరెడ్డి రాజుబాబు, శెట్టి లోవ, పారుపల్లి దాసు, శెట్టి నానాజీ, శెట్టి గోపీ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు, బ్యాంకు సిబ్బంది

మాకవరపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ కార్పొరేషన్ రుణాలకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ ఇంటర్వ్యూలకు 223 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతామహాలక్ష్మి మాట్లాడుతూ బీసీ, కాపు, క్షత్రియ, తెలగా, ఈబీసీ, రెడ్డి బ్రాహ్మణ, వైశ్య కార్పొరేషన్ల రుణాలకు 420 మంది దరఖాస్తులు చేశారన్నారు. వీరిలో 230 మంది మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు. రుణాల మంజూరుకు సంబంధించి అన్ని బ్యాంకుల నుంచి సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నంలో ఇంటర్వ్యూలకు 170 మంది హాజరు

నర్సీపట్నం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బీసీ, కాపు, క్షత్రియ, తెలగ, ఈబీసీ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య కులాలకు సంబంధించి కార్పొరేషన్ రుణాల మంజూరుకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. పట్టణం, మండల వ్యాప్తంగా మొత్తం 66 యూనిట్లకు 270 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 170 మంది హాజరైనట్టు అధికారులు వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూలను ఎంపీడీవో కె.ఉషశ్రీ, ఏవో రమణబాబు, మండలంలోని వివిధ బ్యాంకులకు చెందిన అధికారులు నిర్వహించారు.

దొంగ మస్తర్లు వేస్తే చర్యలు తప్పవు

▸▸ డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి



తప్పుడు మస్తర్లు ఎందుకు వేశారంటూ సిబ్బందిని ప్రశ్నిస్తున్న పీడీ

మాకవరపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కూలీలు పనులు రాకుండా దొంగ మస్తర్లు వేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టరు పూర్ణిమాదేవి హెచ్చరించారు. మండలంలో 31 పంచాయతీల్లో రూ.20.37 కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి చేపట్టిన సామాజిక తనిఖీలపై శుక్రవారం ప్రజావేదిక నిర్వహించారు. బూరుగుపాలెం గ్రామంలో జరిగిన ఉపాధి పనుల్లో ఎంబుక్ కాకుండానే నగదు పంపిణీ చేశారని, తూటిపాలలో పనులకు రాకుండానే రూ.11,900 డ్రా చేశారని, పది మందికి పనులు కల్పించలేదని తమకు ఫిర్యాదులు అందాయని రిసోర్సుపర్సన్లు తెలిపారు. దీంతో తూటిపాల వీఆర్‌పీపై పీడీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అలాగే మరికొన్ని గ్రామాల్లో గృహ నిర్మాణాలకు సంబంధించి రికార్డు కాకుండానే బిల్లులు ఎందుకు డ్రా చేశారని హౌసింగ్ సిబ్బందిని ప్రశ్నించారు. కాగా వీపీ అగ్రహారం, బీఎస్ పేట, జి.గంగవరంతో పాటు మరికొన్ని గ్రామాల్లో చేసిన పనులకు ఆనవాళ్లతో పాటు పని బోర్డులు ఏర్పాటు చేయలేదని, చాలా చోట్ల పాత ఫొటోలు పెట్టారని సోషల్ ఆడిట్ సిబ్బంది తెలిపారు. అలాగే చాలా చోట్ల మొక్కలు చనిపోతున్నా సంరక్షణ చర్యలు సక్రమంగా చేపట్టడం లేదని తెలపగా, ఫారెస్టు సిబ్బందిని పీడీ నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతమహాలక్ష్మి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ చిన్నారావు, ఏపీవో వరలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో కోటి 27 లక్షల పని దినాలు లక్ష్యం

జిల్లాలో ఈ ఏడాది కోటి 27 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించామని డ్వామా పీడీ పూర్ణిమాదేవి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ పంచ ప్రాధాన్యంగా ఐదు పనులు చేస్తున్నామన్నారు. ఏప్రిల్‌లో ప్రతీ పంచాయతీలో పశువులకు నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ చేపల చెరువులను ఏర్పాటు చేసి, చేపల పెంపకం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. అలాగే వేసవిలో రూ.290 నుంచి రూ.300 వేతనం వచ్చేలా పనిదినాలు చూడాలన్నారు. వంద రోజులు పని పూర్తి చేసుకున్న కూలీల పిల్లలకు ఉన్నతి పథకం ద్వారా శిక్షణ ఇచ్చి, వారికి ఉద్యోగాలు కల్పిస్తామని పీడీ తెలిపారు.

అంగరంగ వైభవంగా నూకాలమ్మ పండుగ

అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు... అలరించిన మహిళల చిడతల కోలాటం

నర్సీపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నూకాలమ్మ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి భక్తులు క్యూలో ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు కుంకుమలు, చీర సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నర్సీపట్నంలో నూకాంబికా యూత్ ఆధ్వర్యంలో భక్తులకు పులహోర ప్రసాదం, మజ్జిగ, వాసవీ క్లబ్, వాసవీ కల్యాణ మండప సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ, గ్లూకోజ్ సరఫరా చేశారు. సాయంత్రం స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాత ఇంటి దగ్గర నుంచి అబీద్ సెంటర్‌లోని నూకాలమ్మ గుడి వరకు సంబరం నిర్వహించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు, తనయులు విజయ్, రాజేశ్ కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శక్తివేషాలు, అఘోరా, కాంతారా, డప్పులు, చిడతలు కోలాటం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎన్టీఆర్ మిని స్టేడియంలో స్టేజ్ ప్రోగ్రామ్ ఆకట్టుకుంది.

నాతవరంలో...

నాతవరం: మండలంలోని జిల్లేడిపూడిలో కొత్త అమావాస్య పండుగను ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను అర్ధరాత్రి వరకు తిలకించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: మండలంలోని మునిసిపాలెం, అడిగర్లపాలెం, తూటిపాల, తామరం, పైడిపాల గ్రామాల్లో నూకాలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు చేరుకొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలోని ఎం.అమండలో నూకాంబికా గ్రామదేవత వార్షికోత్సవం ఘనంగా జరిగింది. సర్పంచ్ దాడి జగన్ దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. నాగయ్యపేటలో పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని కేపీ.అగ్రహారం గ్రామంలో నూకాంబిక జాతర ఘనంగా నిర్వహించారు. పట్టణ ప్రాంతాల్లో స్థిరపడిన బ్రాహ్మణులు ప్రత్యేకంగా స్వగ్రామం చేరుకొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఎర్రవాయు ప్రాంతానికి ప్రసిద్ధి చెందిన ఆలయం కావడంతో భక్తులు అధికంగా తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కాగా జాతర సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు, జిల్లా స్థాయి కోలాట ప్రదర్శన పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందించారు. రాత్రి ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. న్యాయనిర్ణేతగా కూచిపూడి అవార్డు గ్రహీత భాస్కరబట్ల సత్యప్రసాద్‌శర్మ, దుర్గాప్రసాద్, భవానీలు వ్యవహరించారు.

పంచాయతీ దుకాణాల వేలం పాటలో గందరగోళం

▸▸ బహిరంగ వేలం నిర్వహించాలని పాటదారుల పట్టు

▸▸ పాత వారికే కేటాయించాలనే యోచనలో పాలకవర్గం

▸▸ ఇరువర్గాల మధ్య వాగ్వాదం.. పోలీసుల రంగ ప్రవేశం



వేలం పాటలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పాటదారుల మధ్య ఘర్షణ

మాడుగుల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ దుకాణాల వేలం పాట నిర్వహణలో గందరగోళం నెలకొంది. పాత వారికే కేటాయించాలనే యోచనలో పాలకవర్గం సభ్యులు ఉండగా, బహిరంగ వేలం పాట నిర్వహించాలని పాటదారుల పట్టుబట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం.. తోపులాట జరిగింది. విషయం తెలియగానే పోలీసులు రంగప్రవేశం చేసి అందరినీ బయటకు నెట్టివేశారు. దీంతో వేలం పాటను శనివారానికి వాయిదా వేశారు.

మాడుగుల మేజర్ పంచాయతీలో కాంప్లెక్స్-1లో 17, కాంప్లెక్స్-2లో 13 కలిపి మొత్తం 30 దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలకు పంచాయతీ కార్యాలయం ఒకటో సచివాలయంలో శుక్రవారం బహిరంగ వేల పాట నిర్వహించారు. ఒక్కో దుకాణానికి రూ.వెయ్యి చొప్పున 114 మంది వ్యాపారులు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొన్నారు. ఈ క్రమంలో పాత వారికే పంచాయతీ షరతుల ప్రకారం అద్దెపై ఐదు శాతం పెంచి కట్టబెట్టాలని పాలకవర్గం సభ్యులు ప్రయత్నించగా, డిపాజిట్‌దారులు వ్యతిరేకించారు. పంచాయతీ ఆదాయానికి పాలకవర్గం గండి కొడుతున్నదని, బహిరంగ వేలంపాట నిర్వహించాల్సిందేనని వారు పట్టుబట్టారు. ఈ తరుణంలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ప్రకారం కేటాయించిన దుకాణాలను తామే పాడుకుంటామని పలువురు స్పష్టం చేశారు. దీంతో పాలకవర్గం, పాటదారుల మధ్య వాగ్వాదం, తోపులాట జరగ్గా, పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను బయటకు పంపించారు. అనంతరం సర్పంచ్ యడ్ల కళావతి మరలా పాట నిర్వహణ వద్దకు వచ్చి ఇప్పటివరకు ఉన్న వ్యాపారులకే తిరిగి షాపులు ఇచ్చేందుకు తీర్మానం చేస్తామని, తమకు తెలియకుండా పాట నిర్వహిస్తే సహించేది లేదని పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబుకి తేల్చిచెప్పి వెళ్లిపోయారు. దీంతో చేసేది లేక శనివారం మధ్యాహ్నం 2 గంటలకు పాట వాయిదా వేసినట్టు పంచాయతీ కార్యదర్శి స్పష్టం చేశారు. బహిరంగ వేల పాట నిర్వహించకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పాటదారులు తెలిపారు.

అయ్యన్న విద్యా సంస్థల్లో ఉగాది వేడుకలు

కె.కోటపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యన్న విద్యా సంస్థల్లో శుక్రవారం ఉగాది వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు మామిడాకుల తోరణాలు, పసుపురంగు పూలమాలలతో ఎంతో ఆకర్షణీయంగా అలంకరణ చేశారు. సంప్రదాయ వస్త్రధారణలో వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకలో భాగంగా విద్యార్థి పంచాంగ శ్రవణాన్ని తోటి విద్యార్థులు శ్రద్ధాసక్తులతో ఆలకించారు. ఉగాది పచ్చడిని అందజేశారు. ఈ వేడుకల్లో అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

కె.కోటపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీ మండల అధ్యక్షురాలు పైలా అమ్మాజీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడపరెడ్డి శ్రీనివాస్ దేవాలయ కమిటీలకు అర్హులైన ఆధ్యాత్మిక భావాలు కలిగిన వ్యక్తులను నియమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వర్రి వెంకట్రావు, శరగడం సన్యాసినాయుడు, బండారు సత్యనారాయణపాత్రుడు, దొగ్గ ఈశ్వర ప్రసాదు, ఇమంది సన్యాసిరావు, సబ్బవరపు శివ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ

చీడికాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఎంపీపీ కురచా జయమ్మ కోరారు. ఈ మేరకు వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబుతో కలిసి తహసీల్దార్ కిశోర్‌లింకన్‌ను కలిశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వైసీపీ నాయకులతో కలిసి తహసీల్దార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ సుంకరి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గొల్లవిల్లి స్వామినాయుడు, పరవాడ మహేశ్, లాలం శివకుమార్, కురచా నారాయణమూర్తి, షేక్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్వేతనాగు హల్‌చల్

దేవరాపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండ కేంద్రంలోని ఒడ్డు చింతల కళ్లాల్లో సుమారు 15 అడుగుల శ్వేత నాగు హల్‌చల్ చేసింది. పొలం పనులు చేస్తుండగా లోపల నుంచి వచ్చిన పాము రోడ్డు దాటుతుండగా కుక్కలు అటకాయించాయి. దీంతో వెనుతిరిగి సరుగుడు తోటలోకి వెళ్లిపోయింది. దాన్ని ఎటూ వెళ్లకుండా చేసి స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇచ్చారు. ఈ ప్రయత్నంలో రైతులపైకి పాము బుసలు కొడుతూ పరుగులు తీయించింది. అనంతరం పాము పక్క పొలాల్లోకి వెళ్లిపోయింది. చీకటి పడిపోవడంతో రైతులు ఇళ్లకు వచ్చారు.



ఒడ్డు చింతల కళ్లాల్లోని పొలాల్లో నుంచి రహదారిపైకి వస్తున్న శ్వేత నాగు

చోడవరం ఎక్సైజ్ సీఐకు అవార్డు



ఎక్సైజ్ సీఐకు అవార్డు అందిస్తున్న రాహుల్‌దేవ్

చోడవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నాటుసారా నిర్మూలన కోసం ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమం అమలులో విశేషంగా కృషి చేస్తున్నందుకు ఎక్సైజ్ సీఐ కేవీపీ నాయుడుకు స్టేట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ అవార్డు ప్రకటించారు. పాయకరావుపేటలో ఎక్సైజ్ అధికారులతో గురువారం రాత్రి నిర్వహించిన సమావేశంలో సీఐ కేవీపీ నాయుడుకు అవార్డుతో పాటు నగదు బహుమతిని అందించారు. సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో నాటుసారా తయారీకి తరలిస్తున్న ఐదు వేల కిలోల నల్లబెల్లాన్ని పట్టుకోవడం వంటి కారణాల వల్ల సీఐకు ఈ పురస్కారం లభించింది. ఈ మేరకు సీఐ నాయుడుకు ఎస్ఐ శేఖరం, హెచ్‌సీ అప్పారావు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

మేలుజాతి పశువులతో అధిక పాల ఉత్పత్తి



ప్రదర్శనలో ఎంపిక చేసిన లేగదూడలతో రైతులు

రావికమతం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అధిక పాల ఉత్పత్తి కోసం రైతులు మేలు జాతి పశువులను పెంచుకోవడం మంచిదని కొత్తకోట పశు వైద్యాధికారి జి.బాలతేజ సూచించారు. గంపవానిపాలెంలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన, మేలుజాతి పశువుల పెంపకంతో వచ్చే లాభాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేలు జాతి పశువులను పెంచుకోవడంతో పాటు ఆడపెయ్యిలు పుట్టించే లింగ నిర్ధారిత వీర్య నాళికలు వినియోగంపై పాడి రైతులకు డాక్టర్ బాలతేజ అవగాహన కల్పించారు. అనంతరం జెర్సీ, హెచ్ఎఫ్, ముర్ర, పుంగనూరు, ఒంగోలు, గిర్ వంటి జాతులకు చెందిన 45 లేగపెయ్యిలను ఈ ప్రదర్శనకు తీసుకురాగా, వీటిలో మేలుజాతి లేగ పెయ్యిలను ఎంపిక చేసి ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో రోలుగుంట, కుసర్లపూడి పశు వైద్యాధికారులు జి.లోకేశ్వరావు, సురేశ్, హరిప్రియ, పుష్ప, ఎంపీటీసీ సభ్యురాలు ఎం.భవానీ, టీడీపీ నాయకులు ఎం.రాజుబాబు పాల్గొన్నారు.

క్వారీలను పరిశీలించిన జనసేన ఇన్‌చార్జి రాజు



రోలుగుంటలో క్వారీలను పరిశీలిస్తున్న రాజు

రోలుగుంట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 క్వారీలను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యజమానులు నిబంధనలు ఉల్లంఘించి క్వారీలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని చెప్పారు. సదరు యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోలుగుంటలో రహదారికి ఆనుకుని క్రషర్లు ఉన్నాయని, దీని వల్ల ప్రయాణికులు, ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బలిజి మహారాజు, నాయకులు మైచర్ల నాయుడు, గూనురు మూలునాయుడు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగలా నిర్వహించాలని నాయకులకు, కార్యకర్తలకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ జెండా ఎగురవేయాలని సూచించారు. మండల కేంద్రాల్లో పార్టీ మండల అధ్యక్షులు ఎగురవేయాలని, పంచాయతీ నాయకులు గ్రామంలో ఎగురవేయాలని చెప్పారు. అనంతరం 'నా తెలుగు కుటుంబం' ప్రతిజ్ఞ చేయాలన్నారు. పార్టీ శ్రేణులు విధిగా పాల్గొనాలని ఆయన కోరారు.

అంబేడ్కర్ సేవారత్న అవార్డుకు కాటపల్లి అప్పారావు ఎంపిక

దేవరాపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన దళిత నాయకుడు కాటపల్లి అప్పారావు రాష్ట్ర స్థాయి అంబేడ్కర్ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. గత 30 ఏళ్లుగా అంబేడ్కర్ ఆశయ సాధనే ధ్యేయంగా ఆయన పనిచేస్తున్నారు. సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడుతూ రాజ్యాంగ పరిరక్షణ కోసం పాటుపడుతున్న ఉద్యమ నేతగా గుర్తింపు పొందారు. ఈ మేరకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అప్పారావును అంబేడ్కర్ సేవారత్న అవార్డుకు ఎంపిక చేసింది. ఈ నెల 30న ఒంగోలులో జరగనున్న ఉగాది పురస్కారాల మహోత్సవంలో ఈ అవార్డును అందుకుంటారు.

రీ సర్వేపై రైతులకు అవగాహన

రావికమతం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ నానాజీ చెప్పారు. మండలంలోని గొంప గ్రామ వీధుల్లో రీ సర్వేపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో రైతులకు రీ సర్వేపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు దగ్గరుండి తప్పులు లేకుండా సర్వే చేయించుకోవాలని ఆయన కోరారు.

మోదమాంబకు ప్రత్యేక పూజలు

దేవరాపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలాపల్లి గ్రామంలో మోదమాంబ ఆలయ ఏడో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు కొమార బాబూరావు, పార్టీ నేత తమడాన ప్రసాద్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

'బోర్లకు మరమ్మతులు చేపట్టరా?'

చీడికాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో రెండు బోర్లు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోలేదని ఎంపీటీసీ సభ్యుడు దారపు పెద్దినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కాలనీలో పాలకేంద్రం వద్ద, రాళ్లదిబ్బల కళ్లాల వద్దనున్న బోర్లు మరమ్మతులు పాలయ్యాయన్నారు. అనేకమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన తర్వాత ఒక బోరును పరిశీలించి హెడ్ తీసుకొని వెళ్లిపోయారన్నారు. తర్వాత రాలేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోగా వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి దృష్టికి తీసుకు వెళ్తానని స్పష్టం చేశారు.

రోడ్డు సమస్యపై గిరిజనుల నిరసన

మాడుగుల రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): శంకరం పంచాయతీ పరిధిలోని తమ గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించాలని శుక్రవారం గిరిజనులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కృష్ణంపాలెం, గొప్పూరు నుంచి మహిళలు, గిరిజనులు సీపీఎం నాయకులతో కలిసి 16 కిలోమీటర్లు పాదయాత్ర చేసి మాడుగుల ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. తాడివలస, గొప్పూరు, రాయిపాలెం రాజంపేట, వెలగలపాడు, కొత్తవలస, మామిడిపాలెం గ్రామాలకు అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తి చేయాలని, తాడివలస, కొత్తవలస గెడ్డలపై వంతెన నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకన్న మాట్లాడుతూ ప్రభుత్వం రోడ్డు సమస్య పరిష్కరించి గిరిజనుల కష్టాలను తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నరసింహమూర్తి, గిరిజనులు పాల్గొన్నారు.

నూకాలమ్మ జాతర పోస్టర్ల ఆవిష్కరణ

కృష్ణాదేవిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): లింగంపేట నూకాలమ్మ జాతర వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే జాతరలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.అప్పలనాయుడు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధక్షుడు గోలకొండ శ్రీకాంత్, ఆలయ కమిటీ చైర్మన్ కొడమంచిలి వరలక్ష్మి, ఉత్సవకమిటీ చైర్మన్ లంక సత్యనారాయణ, టీడీపీ, జనసేన నాయకులు సలాదుల ప్రసాద్, మరిశా రమణ, దొరబాబు, కొండలరావు పాల్గొన్నారు.

సంత వేలం పాట ఖరారు

నర్సీపట్నం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేములపూడి మార్కెట్ వారపు సంత వేలం పాట ఖరారైనట్టు ఎంపీడీవో కె.ఉషశ్రీ తెలిపారు. అప్పన్నపాలెంకు చెందిన కె.పైడియ్య పాడినట్టు చెప్పారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, ఏవో రమణబాబు పాల్గొన్నారు.

సంప్రదాయ పంటలకు ప్రభుత్వ ప్రోత్సాహం



గంజాయి సాగుతో అనర్థాలను రైతులకు వివరిస్తున్న వ్యవసాయశాఖాధికారి ఉమాదేవి

కొయ్యూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు చేసి అనర్థాలు తెచ్చుకునేకంటే ప్రభుత్వ సహకారంతో సంప్రదాయ పంటలను వేయాలని మండల వ్యవసాయశాఖాధికారి ఉమాదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని మర్రివాడ పంచాయతీ లూసంలో ఈ మేరకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి సాగు, రవాణాతో వచ్చే అనర్థాలు, చట్టరీత్యా తీసుకునే చర్యలను ఈ సందర్భంగా రైతులకు వివరించారు. ప్రస్తుతం తృణ ధాన్యాలైన రాగులు, సామలు, కొర్రలు, తదితర పంటలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. వీటి వలన ఆర్థికంగా అభివృద్ధి సాధించడం సులువన్నారు. ఈ పంటలను సాగుకు ప్రభుత్వం రాయితీలు అందిస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. అందువల్ల ప్రతీ రైతు గంజాయికి దూరంగా సంప్రదాయ పంటలకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు సాగునీటి వసతికి వీలుగా బోర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఏవోను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు ఎండన్న, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీ నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు



జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

పాడేరురూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్టు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శరగడం శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ ఇంటర్ విద్యార్థుల సబెక్టుల (సిలబస్)లో ఎటువంటి మార్పులు ఉండవన్నారు. అందువల్ల ప్రతి విద్యార్థి తరగతులకు హాజరుకావాలని కోరారు. అలాగే, ఏప్రిల్ 7వ తేదీ సోమవారం నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థుల అడ్మిషన్‌లు జరుగుతాయన్నారు. ఇందుకు అనుగుణంగా కళాశాల వసతి గృహాలను ఏప్రిల్ 1వ తేదీ ప్రారంభించి విద్యార్థులకు భోజన వసతి సౌకర్యాలను కల్పించాలని నిర్వాహకులను ఆయన కోరారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి: సీఐ



కాంగుగండువ గ్రామంలో కొళాయిని ప్రారంభిస్తున్న సీఐ నాయుడు, ఎంపీపీ రాజబాబు

హుకుంపేట మార్చి 28 ఆంధ్రజ్యోతి; ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సీఐ నాయుడు అన్నారు. గురువారం మండలంలోని సొభకోట పంచాయతీ కాంగుగండువ గ్రామంలో తాగునీటి పథకాన్ని ఎంపీపీ కూడా రాజు బాబు ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం పోలీసు సిబ్బంది వృద్ధులకు చీరలు పం పిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గ్రామంలో సమస్యలులేకుండా చూస్తోందన్నారు. కాంగు గండువ గ్రామంలో రూ. 10లక్షలతో తాగునీటి పథకం ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గంజాయి సాగు, విక్రయాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయికి బదులు మిరియాలు, కాఫీ, పసుపు తదితర పంటలను సాగు చేయాలని సూచించారు. తమ దృష్టికి సమస్యలు తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్య క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గోపాల్ కృష్ణ, ఏఈ జగదీశ్‌బాబు, స్థానిక సర్పంచ్ శశిభూషణ్, వైస్ ఎంపీపీ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది ఎకరాల్లో పండ్ల తోటలు దగ్ధం



చింతగరువులో కాలిపోయిన పండ్ల మొక్కలు

పెదబయలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిన్నెలకోట పంచాయతీ పరిధిలోని చింతగరువు గ్రామంలో రైతుల సాగులో ఉన్న ఎనిమిది ఎకరాల పండ్ల తోటలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించటంతో దహనమయ్యాయి. గ్రామానికి చెందిన కొర్ర రామాంజులు, కొర్ర చంద్రశేఖర్, కొర్ర మల్లుదొర, బుటారి సుబ్బారావులు రెండెకరాల చొప్పున 8 ఎకరాల్లో నాందీ సంస్థ వారు పంపిణీ చేసిన వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు. వీటి పెంపకానికి రైతులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఎవరో గిట్టని వ్యక్తులు శుక్రవారం ఆ పండ్ల మొక్కలకు నిప్పు పెట్టారు. మంటలను గమనించిన స్థానికులు, రైతులు హుటాహుటీన వెళ్లి ఆ మంటలను అదుపు చేశారు. ఇంతకు ముందు రెండు సార్లు ఇలా నిప్పంటించినట్టు బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు



గసభ కొండపైన నరికిన నీలగిరి కలప



వ్యాన్‌లో రవాణాకు సిద్ధం చేసిన దృశ్యం

అక్రమంగా తరలిపోతున్న కలప

డుంబ్రిగుడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో నుంచి అటవీ కలప విచ్చలవిడిగా తరలిపోతోంది. ఎక్కడికక్కడ యథేచ్ఛగా చెట్లు నరికేయడంతో పచ్చదనం కనుమరుగవుతోంది. గసభ పంచాయతీ పరిధి గిరిజన గ్రామాల్లో కొన్ని వారాలుగా కొంతమంది అక్రమంగా కలపను తరలించుకుపోతున్నారు. గిరిజనులను ఆసరాగా చేసుకుని ప్రైవేటు వ్యక్తులు కలపను మైదాన ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. గిరిజనులు సాగు చేసిన తోటల కలప విక్రయాలకు సంబంధిత అటవీశాఖ అనుమతులు తీసుకోకుండా అక్రమంగా తలించుకుపోతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై అరకు డివిజన్ అటవీశాఖ రేంజ్‌అధికారి శ్రీనివాసరావుని వివరణ కోరగా.. నీలగిరి చెట్లను గిరిజనులు వారి తోటల్లో సాగు చేస్తున్నారని చెప్పారు. వారికి ఆర్థిక అవసరాల కోసం ఈ కలప నరికివేత కోసం అనుమతులకు దరఖాస్తులు పెట్టుకుంటున్నారని చెప్పారు. వీఆర్వో, తహసీల్దార్ నివేదికను పూర్తిస్థాయిలో పరిశీలించిన అనుమతులు ఇచ్చేందుకు చర్యలుచేపడుతున్నామన్నారు. ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా కలప తరలించినట్టు తెలిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు



రత్నంపేటలో రంగులువేసి సిద్ధం చేస్తున్న స్థూపం

కొయ్యూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు మేరకు శనివారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించేందుకు మండల నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పార్టీ మండల కార్యదర్శి తోట దొరబాబు ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లో పార్టీ జెండా దిమ్మలు ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రంగులు వేసి సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు 33 పంచాయతీల పరిధిలో శనివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించే దిశగా చర్యలు తీసుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తరలింపునకు చర్యలు

›› 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



సీలేరులో తల్లులతో మాట్లాడుతున్న సూపర్ వైజర్ మోహిని

సీలేరు, మార్చి 28, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె ఇంట్లోకి మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మోహిని తెలిపారు. 'శిథిల భవనంలో అంగన్‌వాడీ కేంద్రం' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం వెలువడిన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. ఈ కేంద్రాన్ని శిథిల భవనం నుంచి తాత్కాలికంగా వేరే చోటకు మార్చాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో జీకేవీధి సీడీపీఓ సూచనలపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మోహిని ఈ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఆమె తల్లులతో సమావేశంనిర్వహించారు. కొత్త భవనం మంజూరయ్యేంతవరకు కేంద్రాన్ని ఎక్కడైనా అద్దె ప్రాతిపదిన ఇల్లు తీసుకుని అక్కడ నిర్వహిస్తామన్నారు. దుర్గావీధిలో ఖాళీ ఉన్న బంగారమ్మ ఇంట్లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తామని ఆమె ఈసందర్భంగా వివరించారు.

తామరాపల్లిలో 450 మందికి వైద్య పరీక్షలు



రోగికి రక్తపరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

చింతపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివారు తామరాపల్లి గ్రామంలో హెల్పేజ్ ఇండియా, రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసు సొసైటీ ప్రతినిధులు సంయుక్తంగా శుక్రవారం మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యనిపుణులు 450మంది ఆదివాసీ రోగులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసు సొసైటీ కార్యదర్శి గాడి శ్రీను మాట్లాడుతూ ఆదివాసీలకు(పీవీటీజీ)లకు ఎన్టీపీసీ ఉద్యోగుల సహకారంతో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ సిబ్బంది సింహాద్రి, ప్రకాశరావు, శివం ప్రతాప్ సింహ, ప్రత్యేక వైద్యనిపుణులు పి.కృష్ణ కుసుమ, సి. మహాలక్ష్మి, ఎం. రాఘవేంద్ర, ఎస్‌వీఎల్ ప్రావీణ్య, ఎం. లక్ష్మి, ఎల్. శాంతి ప్రియ, వి. అజయ్ శ్రీరామ్, ధనలక్ష్మి, సంధ్య, ఏసురత్నం, ఎన్‌జీవోల ప్రతినిధులు వెంకటరావు, సీదరి శ్రీనివాసరావు, శతపతి, నాగబాబు, భాస్కరరావు పాల్గొన్నారు.

'మావోయిస్టుల వారోత్సవాలు వద్దు'



మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

కొయ్యూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి) మావోయిస్టుల వారోత్సవాలు వద్దు తమకు అభివృద్ధే ముఖ్యమని శుక్రవారం యు. చీడిపాలెం శివారు పలకజీడి వారపు సంతలో గిరిజనులు స్వచ్ఛందంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అరాచకాలొద్దంటూ నినాదాలిచ్చారు. ఉద్యమాల పేరుతో అభివృద్ధిని అడ్డుకోవద్దు అంటూ కోరారు. ఈ మేరకు బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు. యు. చీడిపాలెం పంచాయతీ అత్యంత మారుమూల మావోయిస్టు ప్రభావిత పలకజీడి వారపు సంతలో అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొని ఈ ర్యాలీ నిర్వహించటం గమనార్హం.

ప్లాస్టిక్ నిషేధంతోనే స్వచ్ఛాంధ్ర



పాడేరులో నిర్వహించిన ర్యాలీలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు

పాడేరురూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాడేరు మేజర్ పంచాయతీలో ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్న ప్లాస్టిక్ నిషేధానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో జె.తేజరతన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టీఎన్.రసూల్ కోరారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాం ధ్రలో భాగంగా ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండాలన్నారు. పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తరచూ ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ప్రభుత్వ డిగ్రీకళాశాల నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు వి.రమేశ్‌బాబు, జానకీరామ్, సీహెచ్.అచ్యుతరావు, ఐక్యూసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, అధ్యాపకులు సునీత, శంకరరావు, రాధాకుమారి, గోవిందరాజు, ప్రసన్న, లావణ్య, హిమబిందు, జీవనజ్యోతి, ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

పదో తరగతి సైన్స్ పరీక్షకు 99 మంది గైర్హాజర్



పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులను తనిఖీ చేస్తున్న సెక్యూరిటీ, పోలీసులు

పాడేరురూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 22 మండలాల్లో 71 పరీక్ష కేంద్రాల్లో శు క్రవారం జరిగిన పదో తరగతి సైన్స్ పరీక్షకు 99.15 శాతం మంది విద్యార్థులు హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ (ప్రభు త్వ పరీక్షలు) శశికుమార్ తెలిపారు. ఈ పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 11,659 మంది హాజరు హాజరుకావాల్సి ఉండగా, 11, 560 (99.15) శాతం మంది రాశారన్నారు. మిగిలిన 99 మంది గైర్హాజరైనట్టు పేర్కొన్నారు. అలాగే, ప్రైవేటు విద్యార్థులు 12 మంది లో(57.14)శాతం తొమ్మిది మంది గైర్హాజరయ్యారన్నారు. అలాగే, జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీవోఎస్‌ఎస్) ఓ పెన్ స్కూల్ పది పరీక్షకు 86.22 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలకు 1,132 మందిలో 976 (86.22) శాతం హాజరు కాగా, 156 మంది గైర్హాజరైనట్టు వారు పేర్కొన్నారు.

కించుమండలో వీధి దీపాలు ఏర్పాటు

డుంబ్రిగుడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కించుమండ గ్రామ పంచాయతీలో శుక్రవారం కించుమండ పంచాయతీ సర్పంచి చెల్లమ్మ ఆధ్వర్యంలో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామం మీదుగా జాతీయ రహదారి ఉన్నందున పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

అలాగే పంచాయతీ పరిధిలోగ్రామాల్లో తాగునీటి, డ్రైనేజీ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంజీవ్, వార్డు సభ్యులు లాల్‌బాబు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

'హౌసింగ్ బిల్లుల మంజూరుకు వసూళ్లు'



సీలేరులో తల్లులతో మాట్లాడుతున్న సూపర్ వైజర్ మోహిని

ముంచంగిపుట్టు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ గృహాలు, బిల్లులు మంజూరులో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న హౌసింగ్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్ర ముగింపు సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో తాగునీటి సమస్య, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహిళలు ఖాళీ బిందెలతో ర్యాలీగా తహ సీల్దార్ కార్యాలయానికి వెళ్లి ముట్టడించారు. వినతి పత్రాలను తహసీల్దార్ నర్సమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణమూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి త్రినాథ్ మాట్లాడుతూ మండలంలో జల్ జీవన్ మిషన్ ద్వారా సుమారు రూ.52 కోట్లు తాగునీటి పథకాలకు ఖర్చు చేశామని అధికారులు చెబుతున్నా, ఆ పథకాలు ఎక్కడా కానరావడంలేదన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా నీటి సమస్యను ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. కొత్త రేషన్‌కార్డులు, ఫించన్లు మంజూరు కావడంలేదని, ఉపాధి కూలీలకు వేతనాలు అందక ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. పలు గ్రామాలకు పక్కా రహదారులులేక జనాలు అష్టకష్టాలు పడాల్సి వస్తుందన్నారు. జన్‌మన్ గృహాలు మంజూరు నుంచి బిల్లులు చెల్లింపుల వరకు కొంత మంది హౌసింగ్ అధికారులు, ఇన్స్పెక్టర్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని త్రినాథ్ ఆరోపించారు. మొదటి బిల్లుకు రూ.5 వేలు, రెండవ బిల్లుకు రూ. 10 వేలు చొప్పున పలుచోట్ల హౌసింగ్ ఇన్‌స్పెక్టర్లు లబ్ధిదారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నర్సమ్మ, శ్రీను, నారాయణ, శంకర్‌రావు, జీనబంధు, గణపతి, ఈశ్వరి, పలు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల పిల్లలకు ప్రత్యేక కోర్సుల్లో శిక్షణ, ఉద్యోగాలు

›› ఏపీడీ లాలం సీతయ్య



యువతనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏపీడీ సీతయ్య

చింతపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల పిల్లలకు ప్రత్యేక కోర్సుల్లో శిక్షణనందించి ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామని స్థానిక క్లస్టర్ ఏపీడీ లాలం సీతయ్య అన్నారు. శుక్రవారం ఉన్నతి కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పదో తరగతి, ఆపై విద్యార్హత కలిగిన ఉపాధి కూలీల పిల్లలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతి కార్యక్రమంలో భాగంగా ఈ పిల్లలకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణను ఏర్పాటు చేసినట్టు వివరించారు. యువతీ, యువకులకు 14 రకాల కోర్సుల్లో శిక్షణ అందిస్తామన్నారు. 100 రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న ఉపాధి పథకం కూలీల పిల్లలకు తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో రోజుకి రూ.300 చొప్పున ఉపకారవేతనం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమ అధికారి కల్యాణి, ఏపీవో రాజు పాల్గొన్నారు.

4న క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు



కేన్సర్‌కు ఉచిత పరీక్షల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరురూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4వ తేదీ శుక్రవారం స్థానిక మోదకొండమ్మ ఆలయం వద్ద ఉచితంగా నిర్వహించనున్న క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సూచించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ రూపొందించిన పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అదేరోజు ప్రముఖ వైద్య నిపుణులతో కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తారన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై అవగాహన పెంచుకోవాలని కోరారు. అనుమానితులురొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌లకు ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డీఆర్వో కె.పద్మలత, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, హెచ్‌సీజీ కేన్సర్ సెంటర్ మార్కెటింగ్ హెడ్ ధనుంజయ్‌రావు, ఆపరేషన్ హెడ్ స్వాతిక్, ఈవోపీఆర్డీ ఆర్‌వీఎస్.రమేశ్, మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ప్రతినిధులు సల్లా రామకృష్ణ, దన్నేటిపలాసి రాము, పలాసి కృష్ణారావు పాల్గొన్నారు.

'ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి'



ఏఐవైఎఫ్ జాతీయ మహా సభల లోగో ఆవిష్కరిస్తున్న నాయకులు

పాడేరురూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని యువజన సమాఖ్య నాయకుడు అమర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కాఫీ హౌస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మహాసభ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 15 నుంచి 18 వరకు తిరుపతిలో జరగనున్న జాతీయ మహాసభలకు యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. యువతలో ప్రగతిశీల, అభ్యుదయ భావజాలం, లౌకిక, ప్రజాస్వామిక ఆలోచనలను పెంపొందించేందుకు ఏఐవైఎఫ్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రధాని మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్లలో హామీలను అమలు చేయకపోవడంతో నిరుద్యోగం తీవ్రమైందన్నారు. ప్రస్తుతం దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో 45 లక్షల ఉద్యోగాలు, రైల్వేలో 4 లక్షలు, బ్యాంకింగ్ సెక్టారులో 2 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉ న్నాయన్నారు. యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యపై ఏపీలో తొలిసారిగా ఈ జాతీయ మహాసభలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.లక్ష్మణ్, కె.రాజశేఖర్, వి.కృష్ణ, దొన్ను పాల్గొన్నారు.

కొయ్యూరు వైసీపీ మండల అధ్యక్షుడిగా అప్పారావు

కొయ్యూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడిగా పనిచేసిన జల్లి బాబులు స్థానంలో నూతన అధ్యక్షుడిగా డౌనూరు ఎంపీటీసీ సభ్యుడు బిడజాన అప్పారావు నియమితులయ్యా రు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరాజు ఆదేశాలు జారీ చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు బూదరాళ్లకు చెందిన సుమర్ల సూరిబాబు పార్టీ అధ్యక్షుడిగా గతంలో కొనసాగారు. భాగ్యలక్ష్మి పార్టీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాక సూరిబాబును ఏకారణంగా లేకుండా తొలగించి బాబులుకు ఈ పదవి కట్టబెట్టారు. అయినా, సూరిబాబు పార్టీలో వివిధ కార్యక్రమాలతో చురుకైన పాత్ర పోషిస్తూ వస్తున్నారు. అనంతరం జరిగిన పరిణామాలతో విశ్వేశ్వరరాజు అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన అనంతరం తిరిగి జిల్లాలో సూరిబాబు సముచిత స్థానం కల్పించటమే కాకుండా పార్టీకి విధేయుడిగా పనిచేస్తున్న అప్పారావుకు పార్టీ పగ్గాలు అప్పగించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి పాటుపడతానన్నారు.

ఘనంగా ముగిసిన బోడకొండమ్మ శాంబరీ దేవి జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి బాలరాజు దంపతులు

గూడెంకొత్తవీధి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గూడెంకాలనీలో నాలుగు రోజులుగా జరుగుతున్న బోడకొండమ్మ శాంబరిదేవి జాతర ఘనంగా ముగిసింది.శుక్రవారం రాత్రి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు.మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, రాధా దంపతులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులను సమర్పించుకున్నారు. అమ్మవారి పాదాలను బాలరాజు దంపతులు, ఉత్సవ కమిటీ నా యకులు వినాయకరావు, రామకృష్ణ, గ్రామ మహిళలు, పెద్దలు జీకేవీధి పురవీధుల్లో ఊరేగించి అనుపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ



మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీలు, సిబ్బంది

జి.మాడుగుల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మినీ అంగన్‌వాడీలకు చేపట్టిన పోషణ బీ పడాయి బీ శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ మేరకు గురువారం మండలంలోని 152 మంది మనీ అంగన్‌వాడీలతో స్థానిక సీడీపీవో సువర్ణమ్మ సమావేశ మయ్యారు. ఈ శిక్షణలో పొందిన అంశాలను విధిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి అన్ని విధాలా కృషి

» ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా


ఇఫ్తార్ విందులో పాల్గొన్న కొణతాల, పీలా, బుద్ద, బత్తుల తదితరులు

కశింకోట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ముస్లింల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. రంజాన్ మాసం ముగింపు సందర్భంగా జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె.రెహ్మాన్ (బాబర్) శుక్రవారం రాత్రి నూరీమసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌లతో కలిసి హాజరయ్యారు. ముందుగా ముస్లింలతో కలిసి మసీదులో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె.రెహ్మాన్ మాట్లాడుతూ కశింకోట, అనకాపల్లిలలో షాదీఖానాలు, బర్రెల గ్రౌండ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు ఎం.ఎం.అలీ, రబ్బానీ, ఎం.డి.రజాక్, సయ్యద్ రెహ్మతుల్లా, కూటమి నాయకులు బుదిరెడ్డి చిన్న, సిదిరెడ్డి శ్రీనివాసరావు, తాకాశి కృష్ణ, దాడి నాగరాజు, సిదిరెడ్డి సూర్యనారాయణ, ఉగ్గిన రమణమూర్తి, కలగ గోవింద తదితరులు పాల్గొన్నారు.

'అన్ని గ్రామాల్లో టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం'


పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జి

పరవాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాదిలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జి పిలుపునిచ్చారు. ఇక్కడి మరిడిమాంబ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలంతా కలిసి కట్టుగా ఉంటూ పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ నెల 30న పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహించాలన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలని నాయకులకు సూచించారు. పార్టీ సభ్యత్వం పొందిన కార్యకర్తలందరికీ గుర్తింపు కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, 77వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాల అచ్చింనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, నాయకులు చింతకాయల ముత్యాలు, ఇందల కొండలరావు, పైలా రామచంద్రరావు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, బొడ్డపల్లి అప్పారావు, బొండా సన్నిదేముడు, పైలా వరలక్ష్మి, వెంకటరావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిల వసూళ్లకు జడ్సీ పర్యటన


ఇంటి యజమానితో మాట్లాడుతున్న జడ్సీ

అనకాపల్లి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోన్ అధికారులు ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జోనల్ కమిషనర్ బీవీ రమణ, ఇన్‌చార్జి ఆర్‌వో కె.రమణ, రెవెన్యూ సిబ్బంది పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు గవరపాలెంలోని అగ్గిమర్రిచెట్టు ప్రాంతం, పలు సామిల్లుల వద్దకు వెళ్లి ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం యాభై శాతం వడ్డీ రాయితీ కల్పించినందున తక్షణమే బకాయిలను చెల్లించాలని సూచించారు. అనంతరం రెండు, నాలుగు, ఆరు వార్డు సచివాలయాలను జడ్సీ సందర్శించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు

కొత్తూరు, మార్చి28 (ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా పంటలకు ఎరువులను వినియోగిస్తే సత్ఫలితాలు సాధించవచ్చునని అగ్రికల్చర్ డివిజన్ ఆఫీసర్ ఎం.రామారావు అన్నారు. మండలంలోని తగరంపూడి సచివాలయంలో రైతులకు శుక్రవారం భూసార పరీక్షలపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రతి పంటకు కావాల్సిన పోషకాలను ముందుగా గుర్తించాలన్నారు. ఎక్కువ పోషకాలు వాడడం వల్ల మట్టిలో రసాయనాలు పెరిగి నీటి నాణ్యతను దెబ్బతీస్తాయని వివరించారు. మట్టి పరీక్షలు చేసి ఎక్కువ పోషకాలు ఉన్నాయో లేవో తెలుసుకోవాలన్నారు. దీని ద్వారా పోషకాలు సరైన రీతిలో నేలలో సమతుల్యంగా ఉండి పంటలకు అవసరమైన పోషకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రంగాచారి, అగ్రికల్చర్ అసిస్టెంట్ పుష్ప పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీల రద్దుకు ఆందోళన

అనకాపల్లి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలపై గుదిబండగా మారనున్న విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారంగా ఏర్పడి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల కాలంలో విద్యుత్ చార్జీలు తగ్గించకపోగా, రూ.15,487 కోట్లు అదనంగా సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజలపై వేసి బలవంతంగా వసూలు చేస్తుందని ఆరోపించారు ఇది కాకుండా ప్రతి నెలా యూనిట్‌కు అదనంగా 40 పైసలు చొప్పున సర్దుబాటు చార్జీ వసూలు చేస్తున్నారన్నారు. పార్టీ నాయకులు ఎం.అప్పలరాజు, ఆర్.శంకర్రావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వేడుకల ఆరంభంలో కేరళ డప్పు వాయిద్యాలు


నవశక్తుల వేషధారణలో ఉన్న కళాకారుల నృత్యాలు

అమ్మ జాతర ఆరంభం

అనకాపల్లి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత.. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి.. అనకాపల్లి నూకాంబిక అమ్మవారి కొత్త అమా వాస్య జాతర శుక్రవారం రాత్రి నేత్ర పర్వంగా ఆరంభమైంది. ఈ సందర్భంగా పట్టణంలో ఎటు చూసినా సందడి నెలకొంది. కేరళ డప్పు వాయిద్యాలు, నవ శక్తుల నృత్యాలు, కళాకారుల కోలాటాలు తదితరాలతో ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. ఆలయ మార్గాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవంలో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అనకాపల్లి డీఎస్పీ ఎం. శ్రావణి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. జాతర ప్రారంభోత్సవంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఉత్సవ కమిటీ సభ్యులు నూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, యర్రవరపు లక్ష్మితో పాటు కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇదివుండగా, పట్టణమంతా శ్రీనూకాంబికాయ నమః అనే నామసంకీర్తన ప్రజలందరికీ వినిపించేలా స్పీకర్లు ఏర్పాటు చేశారు. 50 సీసీ కెమెరాలను ముఖ్యమైన కూడళ్లల్లో పోలీసులు సిద్ధం చేశారు.


జాతర ప్రారంభోత్సవంలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా తదితరులు


మహిళల కోలాటం


అమ్మవారి కీర్తనలను ఆలపిస్తున్న గాయనీమణులు

ప్రేక్షకులను మెప్పించిన ప్రదర్శనలు


పెద్దలకు మాత్రమే నాటికలోని ఓ సన్నివేశం

అనకాపల్లి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి వీవీ రమణ రైతు భారతి ఓపెన్ ఆడిటోరియంలో శుక్రవారం రాత్రి ప్రారంభమైన నాటికోత్సవాల్లో భాగంగా తొలి రోజు ప్రదర్శించిన రెండు నాటికలు ప్రేక్షకులను కట్టిపడేశాయి.

ఆలోచింపజేసిన 'పెద్దలకు మాత్రమే...'

ఆనందరావు తన కుటుంబ సభ్యులు నీతిగా నిజాయితీగా జీవించాలని ఆశించే ఆదర్శమూర్తి. ఆఫీసులో లంచాలు తీసుకునే కొడుకు శ్రీనివాస్, అనవసరంగా తన మనవడితో అబద్ధాలు చెప్పించే కోడలు మంగ, వీరికి సహకరిస్తున్న వియ్యంకుడు కోటయ్య ప్రవర్తనలో మార్పు తేవాలని ప్రయత్నిస్తాడు. చిన్న పిల్లల్ని పెంచడం అంటే ఒక బొమ్మను చెక్కి సమాజానికి అందించడం, ఉలి వంకరగా ఉంటే ఆ బొమ్మ చక్కగా రాదని తెలియజేసి వారిలో కనువిప్పు కలిగిస్తాడు. మారిన కుటుంబం ఆనందరావుతో కలిసి ఆనందంగా ముందుకు నడుస్తారు, 'పెద్దలకు మాత్రమే..' అనే ఈ నాటకాన్ని ఆకెళ్ల సూర్యనారాయణ రచించగా, సీఎస్ మూర్తి దర్శకత్వం వహించారు. కాకినాడ శ్రీమూర్తి కల్చర్ అసోసియేషన్ కళాకారులు ఈ నాటికను అద్భుతంగా ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు.


సహ ప్రయాణం నాటికలోని ఘట్టం

కనువిప్పు కలిగించిన 'సహ ప్రయాణం'

మహాదేవయ్య, పార్వతుల దంపతులు సనాతన ధర్మానికి, ఆచార సంప్రదాయాలకు, కళలకు వారసులు. మహాదేవయ్య భార్య అనారోగ్యంతో జీవనం సాగిస్తూ ఉంటుంది. వారి ఊరిలోనే మృదంగ విద్వాన్ శరభయ్య ఈ కుటుంబానికి ఆప్తుడు. మహాదేవయ్య, శరభయ్యలు ఇద్దరూ ఆ ఊరి మేలుకోరి నగర సంకీర్తన చేస్తూ ప్రజలకు మంచి జరగాలని కోరుకుంటూ జీవనం సాగిస్తారు. మహాదేవయ్య కొడుకు శేఖరం పెద్ద అధికారి. ఉద్యోగ రీత్యా పట్నంలో ఉంటూ తల్లిదండ్రులను తన వద్దే ఉండమని, ఈ ఆచార సంప్రదాయాలు వద్దని వారిస్తూ ఉంటాడు. కానీ ప్రతి ఏడు సంక్రాంతికి తమ సొంత ఊరికి వచ్చి నగర సంకీర్తన చేయడం, వేషాలు వేయడం, ఆనందంగా నాలుగు రోజులు గడపడం మహాదేవయ్య కుటుంబానికి ఆనవాయితీ. ఈసారి కొడుకు శేఖరం వద్దన్నా వినకుండా ఊరిలో నగర సంకీర్తన చేయడం కోసం కొడుకుతో ఘర్షణ పడతాడు. కొడుకు కోపంతో భార్యని తీసుకొని పట్నం వెళ్లిపోతాడు. పార్వతి కోరిక మేరకు మహాదేవయ్య అర్ధనారీశ్వర వేషంతో ఆనంద తాండవం చేస్తూ ఉంటే భార్య ఆనంద పారవశ్యంతో శివైక్యం చెందుతుంది. మహాదేవయ్య అది చూసి నిశ్చేష్టుడై బాధతో అసువులు బాస్తాడు. పట్నం వెళ్లిన కొడుకు, కోడల్ని శరభయ్య తిరిగి ఇంటికి తీసుకొని రాగా కొడుకు ఈ సంఘటన చూసి వేదనతో తన తప్పు తెలుసుకొని తండ్రి ఆశయాలను స్వీకరించి అనుసరిస్తాడు.

తుమ్మపాలలో ఆకట్టుకున్న కవి సమ్మేళనం


కవి సమ్మేళనంలో పాల్గొన్న ప్రముఖులు

తుమ్మపాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం తుమ్మపాల శాఖా గ్రంథాలయంలో శుక్రవారం సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. తెలుగు గొప్పదనంతో పాటు తెలుగువారి సాంప్రదాయాలను పలువురు కవులు వివరించారు. ఈ సమ్మేళనంలో విజేతలకు సాహితీ మిత్రులు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి కాదాంబరి శ్రీనివాస్, ద్వితీయ బహుమతి కర్రి మల్లేశ్వరి, తృతీయ బహుమతి తిరుమల శ్రీలు సాధించారు. అలాగే గాయత్రి, ఆదికోటి, బ్రహ్మాజీలు ప్రోత్సాహక బహుమతులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ నిర్వాహకులు శ్రీనివాస్, నాయకులు సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో ఆక్రమణలను గుర్తించండి

» కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కోరిన ఎమ్మెల్యే కొణతాల

» ఇరువురూ కలిసి ఎర్రచెరువు పరిశీలన

కొత్తూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరులో ఆక్రమణలను గుర్తించి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. శుక్రవారం ఆయన కలెక్టర్‌తో కలిసి కొత్తూరు ఎర్రచెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడి డంపింగ్ యార్డును పరిశీలించి చుట్టూ ప్రభుత్వ భూమి ఎంత ఉందో సమగ్ర సర్వే చేపట్టాలని సూచించారు. ఎనిమిదిన్నర ఎకరాల్లో ఉన్న డంపింగ్ యార్డు స్థలంలో చిల్డ్రన్ పార్కు ఏర్పాటు, ప్లే గ్రౌండ్ లేదా ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలన్నారు. చెరువు చుట్టూ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నూతనంగా నిర్మాణమవుతున్న ఆర్డీవో కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచి, అందుబాటులోకి తీసుకురావాల్సిన ఏర్పాట్లు చేయాలని కోరారు. వీరి వెంట ఆర్డీవో ఆయేషా, పలువురు రెవెన్యూ అధికారులు ఉన్నారు.

మూలస్వయంభూవరంలో అధికారుల పర్యటన

» కాలుష్యం కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామస్థులు గోడు


అధికారులతో మూలస్వయంభూవరం గ్రామస్థుల

పరవాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీ కాలుష్య కోరల్లో చిక్కుకున్న కలపాక పంచాయతీ పరిధి మూలస్వయంభూవరంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు శుక్రవారం పర్యటించారు. కాలుష్యం కారణంగా పడుతున్న ఇబ్బందులను గ్రామస్థులు వారికి వినిపించారు. సింహాద్రి ప్లాంట్‌కు చెందిన చిమ్నీల నుంచి వెలువడుతున్న ఉప్పునీటి తుంపర్లు వలన ఇంటి పైకప్పులు దెబ్బతింటున్నాయన్నారు. కిటికీలు, తలుపులు తుప్పు పడుతున్నాయని, పంటలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భజలాలు కలుషితం కావడంతో తాగునీటిని కొనుక్కోవాల్సి వస్తోందన్నారు. ఉప్పు నీటి తుంపర్లు కారణంగా విద్యుత్‌వైర్లు తుప్పుపట్టి తెగి పడుతున్నాయని వివరించారు. శబ్ద కాలుష్యం విపరీతంగా ఉందని, దీనివల్ల రాత్రుళ్లు నిద్ర కరువవుతుందని వాపోయారు. చర్మ సంబంధిత రోగాలతో పాటు కీళ్ల వ్యాధుల బారిన పడుతున్నామని తెలిపారు. గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాన్ని తరలించేంత వరకు తాగునీటి సరఫరాతో పాటు, విద్యుత్ వైర్ల నిర్వహణ పనులను ఉచితంగా చేపట్టాలని వేడుకున్నారు. ఈ సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పీవీ ముకుందరావు తెలిపారు. తాగునీటి సరఫరా చేసేలా సింహాద్రి యాజమాన్యంతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేష్, పీసీబీ ఏఈ సూర్యకళ, వ్యవసాయశాఖ ఏవో సీహెచ్.చంద్రావతి పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి రహదారులు సిద్ధం


సంతబయలు జంక్షన్ సమీపంలో కాలువపై సిమెంట్ పలకలు వేసిన దృశ్యం

అనకాపల్లి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రహదారులను తీర్చిదిద్దుతున్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచనల మేరకు జాతీయ రహదారి మీదుగా అచ్యుతాపురం, ఎలమంచిలి ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రైతుల సహకారంతో అస్తవ్యస్తంగా ఉన్న బండి బాటను చక్కగా నిర్మించారు. జాతీయ రహదారిలోని విశాఖ వైపు వచ్చే మార్గంలో వంతెనకు దిగిన కొద్ది దూరంలో ఉన్న బండి బాటను రహదారిగా మార్పు చేశారు. ఈ మార్గం గుండా భక్తులు నేరుగా మరిడి మాంబ ఆలయం వరకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేరుకొని అక్కడి నుంచి అతి తక్కువ దూరంలో ఉన్న అమ్మవారి ఆలయానికి చేరుకునేలా 30 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మాణం చేపట్టారు. అలాగే తోటాడ జంక్షన్‌కు సమీపంలోని పెట్రోల్ బంకుకు ఎదురుగా ఒక రహదారిని నిర్మించారు. ఈ మార్గం ద్వారా పరశురాంపేటకు వచ్చి అక్కడి నుంచి సంతబయలు మీదుగా ఆలయానికి చేరుకునేలా చర్యలు చేపట్టారు. అలాగే మరిడిమాంబ ఆలయం నుంచి పూడిమడకరోడ్డుకు, పూల్‌బాగ్ రోడ్డుకు రహదారి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ రోడ్లను గ్రావెల్‌తో తీర్చిదిద్దారు. భవిష్యత్తులో ఇవి సీసీ రోడ్లుగా మారనున్నాయని కూటమి నాయకులు చెబుతున్నారు.

నేటి సాయంత్రం నాలుగున్నర గంటల వరకే నూకాంబిక దర్శనం


ఎస్పీకి అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఈవో

అనకాపల్లి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నూకాంబిక అమ్మవారి దర్శనం శనివారం సాయంత్రం నాలుగున్నర గంటల వరకు మాత్రమే భక్తులకు కల్పిస్తామని ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో వెంపలి రాంబాబు తెలిపారు. అమ్మవారి కొత్త అమావాస్య జాతర సందర్భంగా సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించే నిమిత్తం దర్శనాలు నిలిపివేయడం జరుగుతుందన్నారు. తిరిగి ఆదివారం తెల్లవారుజాము ఐదు గంటల నుంచి అమ్మవారి దర్శనం భక్తులకు కల్పిస్తామని వివరించారు.

నూకాంబిక ఉత్సవానికి ఎస్పీకి ఆహ్వానం

అనకాపల్లి రూరల్ : నూకాంబిక అమ్మవారి ఉత్సవానికి రావాలని ఎస్పీ తుహిన్ సిన్హాను దేవస్థానం ఈవో వెంపలి రాంబాబు శుక్రవారం ఆహ్వానించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఆలయ పరిపాలన, భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై ఎస్పీకు వివరించారు.

మరిడిమాంబకు ప్రత్యేక పూజలు

పరవాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రావాడ పంచాయతీ జల్లెలపాలెంలో మరిడిమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జి, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు వియ్యపు చిన్నలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ మహిళలంతా సారె ఊరేగింపుగా తీసుకు వెళ్లి సమర్పించారు.

టీడీపీ గుర్తింపు కార్డుతో కార్యకర్తలకు భరోసా : బాబ్జీ

సబ్బవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ గుర్తింపు కార్డు ప్రతి కార్యకర్తకు భరోసా వంటిదని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. శుక్రవాయం ఆయన ఇక్కడ పలువురు కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను అందజేసి మాట్లాడారు. పెందుర్తి నియోజకవర్గంలో 40వేల మంది కార్యకర్తలు సభ్యత్వాలు పొందారన్నారు. వీరందరికీ కార్డులు అందేలా నేతలు చూడాలని సూచించారు. ఈ గుర్తింపు కార్డు వలన ప్రమాద బీమా రూ.ఐదు లక్షలు వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరణికాన బాబూరావు, గండి దేముడు, కొటాన అప్పారావు, దొడ్డి సూర్యప్రకాశరావు, దాసరి రమణ, రేసుపూడి రమణ, కోరాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీలా కార్యాలయంలో వినతుల స్వీకరణ

అనకాపల్లి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెంలో గల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కార్యాలయంలో శుక్రవారం గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు టీడీపీ ఆవిర్భావ వేడుకలు

» అన్ని గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించాలి

» పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు పిలుపు



మాట్లాడుతున్న తాతయ్యబాబు. పక్కన కాశీనాయుడు

అనకాపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలను శనివారం జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించాలని జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం అనకాపల్లిలో జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ఉదయం 9 గంటలకు పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు, హాజరవుతున్నారని చెప్పారు. దివంగత నేత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కింద నుంచి పైస్థాయి వరకు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి లాలం కాశినాయుడు పాల్గొన్నారు.

సీఐటీయూ నూతన కార్యవర్గం



కె.లోకనాథం, అధ్యక్షుడు



ఆర్.శంకరరావు, ప్రధాన కార్యదర్శి

అనకాపల్లి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కె.లోకనాథం, ప్రధాన కార్యదర్శిగా ఆర్.శంకరరావు, కోశాధికారిగా వీవీ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా గనిశెట్టి సత్యనారాయణ, ఆర్.రాము, జి.దేవుడునాయుడు, పరమేశ్వరరావు, కార్యదర్శిగా జి.వరలక్ష్మి ఎన్నికయ్యారు. అంతకుముందు జరిగిన సమావేశంలో పూర్వ ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు తీవ్ర నష్టం కలిగించే లేబర్ కోడ్స్‌ను ఏప్రిల్ నుంచి అమలులోకి తీసుకురానున్నదని, దీనిపై కార్మికులంతా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మే 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

మైనింగ్ మాఫియా

... 3వ పేజీ తరువాయి

జరుగుతున్నాయి. సముద్ర తీరంలో నౌకలు నిలుపుదల చేయడానికి బెర్త్‌లు నిర్మిస్తున్నారు. వీటికి అలల తాకిడి లేకుండా వుండడానికి సముద్రంలో రాళ్లతో భారీ కట్ట (బ్రేక్ వాటర్స్) వేస్తున్నారు. ఇందుకోసం భారీ మొత్తంలో నల్లరాయి అవసరం ఏర్పడింది. బండరాళ్లను సరఫరా చేసే కాంట్రాక్టును రాయి క్వారీల నిర్వాహకులు దక్కించుకుని అక్రమ క్వారీయింగ్ చేస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా నల్లరాయిని ఎన్‌ఏవోబీకి తరలిస్తున్నారు. అక్రమార్కులు నాడు వైసీపీ నాయకులతో, ఇప్పుడు కూటమి నాయకులతో అంటకాగుతున్నారు. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ఒక నేత అనుచరులు రోలుగుంట మండలంలో పాగా వేసి అక్రమ మైనింగ్ సాగిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజన్నపేట, కొవ్వూరుల్లో గతంలో వైసీపీ నాయకులు నిర్వహించిన క్వారీలను ప్రస్తుతం కూటమి నేతలు తమ ఆధీనంలోకి తీసుకొని నడుపుతున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

అనుమతి లేకుండా బండరాళ్లను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసే అధికారం రవాణా, పోలీసు శాఖలకు వుంది. కానీ బండరాళ్లను రవాణా చేస్తున్న టిప్పర్లు, లారీలను ఎక్కడా అడ్డుకోవడంలేదు. మరోవైపు గనులు, రెవెన్యూ, పర్యావరణ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. మైనింగ్ మాఫియా నుంచి నెలవారీ మామూళ్లు అందుతున్నాయని, అందువల్లనే చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమ క్వారీలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న పీవీఎస్ఎన్ రాజు

రోలుగుంట మండలంలో నల్లరాయి క్వారీలను అక్రమంగా నిర్వహిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు శుక్రవారం కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్వారీల వల్ల నిండుగొండ, కె.నాయుడుపాలెం, కొవ్వూరు, నందిపురం, వడ్డిప, రాజన్నపేట, తదితర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. బండరాళ్లను రవాణా చేసే భారీ వాహనాల కారణంగా రోడ్లు పాడుతున్నాయన్నారు. విచారణ జరిపించి అనధికార క్వారీలపై చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారని ఆయన చెప్పారు. ఆయన వెంట జనసేన నాయకులు బలిజ మహారాజు, మైచర్ల నాయుడు, గూనూరు మూలునాయుడు, అల్లం రామఅప్పారావు, కర్రి రమేశ్ తదితరులు ఉన్నారు.

బెల్లం మార్కెట్ అభివృద్ధికి చర్యలు

... 3వ పేజీ తరువాయి

ఆమె సందర్శించారు. యార్డులో అందుబాటులో వున్న షెడ్లు, గోదాములు, వినియోగంలో వున్న వాటి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా మార్కెట్ యార్డులో నెలకొన్న సమస్యలు, యార్డు అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. మార్కెట్ యార్డులో రైతు బజార్‌ను ఏర్పాటు చేస్తే వ్యాపార కేంద్రంగా మారుతుందని, ఈ మేరకు కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రవికుమార్, మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతల, జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీవీ రమణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ చేరుకున్న సన్‌రైజర్స్ జట్టు

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఈ నెల 30న ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆటగాళ్లు శుక్రవారం నగరానికి చేరుకున్నారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడ నుంచి ప్రత్యేక బస్సులలో రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకున్నారు. నగరానికి వచ్చిన వారిలో కెప్టెన్ కమిన్స్, ఆల్‌రౌండర్లు నితీష్‌కుమార్‌రెడ్డి, హర్షల్ పటేల్, అభిషేక్ శర్మ, వియాన్ మల్డర్, మెండిస్, బౌలర్లు మహ్మద్ షమి, రాహుల్ చహర్, ఆడమ్ జంపా, సిమ్రజీత్ సింగ్, అన్సారి, జయదేవ్ ఉనద్కర్, ఇషాన్ మలింగ, బ్యాటర్లు ఇషాన్ కిషన్, అథర్వ తైడే, అభినవ్ మనోహర్, అనికేత్ వర్మ, సచిన్ బేబి, హెనిరిచ్, హెడ్, కోచ్ మురళీధరన్ మరో 15 మంది సపోర్టింగ్ స్టాఫ్ ఉన్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు శనివారం నెట్ ప్రాక్టీస్ చేయనున్నారు.



ఇషాన్ కిషన్



జయదేవ్ ఉనాద్కట్



ట్రావిస్ హెడ్



పాట్ కమిన్స్



నితీశ్‌కుమార్‌రెడ్డి



షమీ

‘పేట’లో చిలకల తీర్థం రేపు

» భారీగా ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

» పంచదార చిలకలు, చేటలు సిద్ధం చేసిన వ్యాపారులు



పేరంటాలమ్మ గుడి

పాయకరావుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగనాడు పాయకరావుపేటలో జరిగే పేరంటాలమ్మ అమ్మవారి తీర్థానికి నిర్వాహకులు భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి దర్శనం తరువాత తీర్థంలో విక్రయించే పంచదార చిలకలు కొనుగోలుచేసి ఇళ్లకు తీసుకెళుతుంటారు. దీంతో పేరంటాలమ్మ తీర్థాన్ని చిలకల తీర్థంగా కూడా పిలుస్తుంటారు.



తీర్థంలో విక్రయించడానికి సిద్ధం చేసిన పంచదార చిలకలు

పేరంటాలమ్మ చరిత్ర

పాయకరావుపేటలో నూకాంబిక అమ్మవారి ఆలయం ప్రసిద్ధి చెందింది. సుమారు వందేళ్ల క్రితం రాజాపంతుల వారి ఆడబిడ్డ, మలిపెద్ది వారి కోడలు అయిన నాగపేరంటాలమ్మ కలలోకి నూకాంబిక అమ్మవారు వచ్చి, అగ్నిగుండం ప్రవేశం చేయడం ద్వారా స్థానికుల ఇలవేల్పుగా వర్ధిల్లాలని కోరారు. దీంతో నాగపేరంటాలమ్మ అగ్నిగుండంలోకి ప్రవేశించి ఆత్మాహుతి చేసుకుంది. దీంతో ఆమె కుటుంబీకులు మంగవరంరోడ్డులోని శ్రీసీతారామస్వామివారి ఆలయం వద్ద పేరంటాలమ్మ గుడి నిర్మించి పూజలు చేయడం ప్రారంభించారు. పేరంటాలమ్మను ఇలవేల్పుగా కొలుస్తున్న ఈ ప్రాంత ప్రజలు గత ఐదు తరాలుగా ఉగాది రోజున పేరంటాలమ్మ తీర్థం నిర్వహిస్తున్నారు. ఉగాది రోజు సాయంత్రం పేరంటాలమ్మ గుడివద్ద మలిపెద్ది వారి కుటుంబ సభ్యుల్లో ఒకరిని పేరంటాలమ్మవారు ఆవహించి భవిష్యవాణి వినిపిస్తారని స్థానికుల నమ్మకం. అమ్మవారు పుణ్యస్త్రీగా అగ్నిగుండ ప్రవేశం చేయడంతో గుడికి వచ్చిన మహిళలంతా సంప్రదాయ సూచికగా చేటలు, చిలకలు కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తున్నది. పాయకరావుపేట, తుని పట్టణాలతోపాటు పరిసర గ్రామాల నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చి తీర్థంలో పాల్గొంటారు. పట్టణంలోని మంగవరం రోడ్డులో ఆదివారం జరుగనున్న చిలకల తీర్థానికి నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. చిలకల తీర్థంలో విక్రయించడానికి స్థానిక వ్యాపారులు పంచదార చిలకలు, రంగుల చేటలు, నేతి మిఠాయిలను సిద్ధం చేశారు.

నాటికోత్సవాలు ప్రారంభం

అనకాపల్లి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీవీ రమణ రైతు భారతి ఓపెన్ ఆడిటోరియంలో జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నాటికోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను మాజీ మంత్రి దాడి వీరభద్రరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినీ రచయిత, దర్శకులు ఆకెళ్ల సూర్యనారాయణ రచించిన నాటికలు ఇక్కడ ప్రదర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వీసీహెచ్. నాయుడు, కర్రి దివాకర్, విల్లూరి రాము, సూరిశెట్టి రమణఅప్పారావు, హేమ, కేఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నాటికోత్సవాలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

మట్టిలో మాణిక్యం..

» ఇస్రో సైంటిస్ట్‌గా గ్రామీణ యువకుడు

» ఏడున్నరేళ్లు పీఎం ఆఫీసులో టెక్నికల్ ఆఫీసరుగా విధులు

» కల నెరవేరిందంటున్న శ్రీకాంత్





కుమారుడికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు. (ఇన్‌సెట్‌లో) పోలుపర్తి శ్రీకాంత్

నర్సీపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):

కృషి.. పట్టుదల.. తపన.. ఉంటే లక్ష్యాన్ని చేరుకోవడం పెద్ద కష్టం కాదు. ప్రధానమంత్రి కార్యాలయంలో టెక్నికల్ ఆఫీసరుగా పనిచేసినా తన కలను నిజం చేసుకునేందుకు ఏడున్నరేళ్లు కష్టపడి ఇస్రో సైంటిస్టు అయ్యాడు మండలంలోని యరకన్నపాలెం గ్రామానికి చెందిన పోలుపర్తి శ్రీకాంత్.

నర్సీపట్నం మండలంలోని యరకన్నపాలెం గ్రామానికి చెందిన పోలుపర్తి అప్పలనాయుడు, సత్యవతిల కుమారుడు శ్రీకాంత్. తండ్రి వ్యవసాయం చేస్తుండగా.. తల్లి గృహిణి. శ్రీకాంత్ ఏడో తరగతి వరకు స్వగ్రామం యరకన్నపాలెంలో చదువుకున్నాడు. ఎనిమిదో తరగతి కోటవురట్ల మండలం పాములవాకలో జడ్పీ ఉన్నత పాటశాలలో చదివాడు. అయితే తొమ్మిది, పదో తరగతి నర్సీపట్నంలోని ప్రైవేటు స్కూల్లో విద్యాభ్యాసం చేశాడు. అనంతరం నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈసీఈ డిప్లొమా పూర్తి చేశాడు. తర్వాత బీటెక్‌లో ఈసీఈ పూర్తి చేశాడు. ఇంజనీరింగ్ పట్టా పుచ్చుకున్న ఆరు నెలలకే 2017లో ఢిల్లీలో ప్రధానమంత్రి కార్యాలయంలో టెక్నికల్ ఆఫీసరుగా ఉద్యోగం వచ్చింది. ఏడున్నర సంవత్సరాలు అక్కడ విధులు నిర్వహించాడు. ప్రధానమంత్రి ఆఫీసులో సాంకేతిక అధికారి హోదా.. ప్రతి నెలా లక్ష రూపాయలకు పైగా జీతం వస్తుందని తన లక్ష్యాన్ని పక్కన పెట్ట లేదు శ్రీకాంత్. ఇస్రో సైంటిస్ట్ కావాలన్న తన కలను సాకారం చేసుకోవడానికి నిరంతరం పరితపించాడు. ఉద్యోగం నుంచి ఇంటికి వచ్చిన తర్వాత సాయంత్రం గ్రంథాలయానికి వెళ్లి చదువుకునేవాడు. ఏడున్నర సంవత్సరాల తర్వాత ఆయన కృషికి ప్రతిఫలంగా ఇస్రో సైంటిస్ట్‌గా ఉద్యోగం వచ్చింది. మార్చి 24 తేదీన తమిళనాడులోని మహింద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ విభాగంలో విధుల్లో చేరాడు. దేశానికి అత్యున్నత సేవలు అందించే ఇస్రో సైంటిస్ట్‌గా ఎదిగిన కొడుకుని చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు.

పాలిటెక్నిక్ చదువుకున్నప్పుడే బీజం : శ్రీకాంత్

పాలిటెక్నిక్ చదువుతున్నప్పుడే సైంటిస్ట్ కావాలని అనుకునేవాడిని. చిన్నప్పుడు మా ఇంటికి ఎవరైనా వచ్చి తమ పిల్లలు మంచి ఉద్యోగం చేస్తున్నారని గొప్పగా చెబుతుంటే.. తాను కూడా బాగా చదువుకొని మంచి ఉద్యోగం సాధించాలని ఉండేది. సైంటిస్టో, గ్రూప్-1 ఆఫీసరో అయితే తల్లిదండ్రులకు, తనకు మంచి గుర్తింపు వస్తుందని అనిపించేది. పాలిటెక్నిక్ చదివేటప్పుడు ఇస్రో సైంటిస్ట్ కావలని గట్టిగా నిర్ణయించుకున్నాను. బీటెక్ అయిన వెంటనే పీఎం ఆఫీసులో టెక్నికల్ ఆఫీసరుగా ఉద్యోగం వచ్చింది. అంతటితో ఆగకుండా సైంటిస్ట్ కావాలన్న లక్ష్యంతో చదివి సాధించాను.

ప్రేమికుల ఆత్మహత్య

» ఆమె మైనర్..అతనికి అంతకుముందే వివాహం

» బాలికను చేసుకునేందుకు నెల కిందట విడాకులు



అమీరుద్దీన్‌ఖాన్ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెళ్లికి పెద్దలు అంగీకరించలేదనే కారణంతో ప్రేమికులు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన విశాఖ నగర పరిధిలోని వడ్లపూడిలో శుక్రవారం జరిగింది. ఇందుకు సంబంధించి దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని మర్రిపాలెం సమీప హర్షనగర్‌కు చెందిన అమీరుద్దీన్‌ఖాన్ (36) ఏడాదిగా సింహాచలం గోశాల వద్ద టిఫిన్ దుకాణం నడుపుతున్న పిన్నింటి జయశ్రీ వద్ద చెఫ్‌గా పనిచేస్తున్నాడు. ఆ సమయంలో జయశ్రీ కుమార్తె వెంకటదుర్గ(17)తో చనువుగా ఉండేవాడు. ఆమె ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. తన కుమార్తెతో అమీరుద్దీన్‌ఖాన్ ప్రవర్తన సరిగా లేకపోవడంతో అతడిని జయశ్రీ పని నుంచి తొలగించింది. కాగా అమీరుద్దీన్‌కు గతంలోనే వివాహమైంది. అయితే జయశ్రీ కుమార్తెను పెళ్లి చేసుకునేందుకు వీలుగా నెల రోజుల కిందట విడాకులు తీసుకున్నాడు.

ఇదిలావుండగా జయశ్రీ తన కుమార్తెకు పెళ్లి సంబంధాలు చూస్తోంది. తాను ఇష్టపడిన అమీరుద్దీన్‌ఖాన్‌తో పెళ్లికి తల్లి అంగీకరించే ప్రసక్తి లేదని తెలుసుకున్న ఆమె శుక్రవారం ఉదయం తల్లి టిఫిన్ దుకాణానికి వెళ్లిపోయిన తరువాత ఇంటి నుంచి బయటకు వచ్చింది. దుకాణం నుంచి తిరిగి ఇంటికి వెళ్లిన జయశ్రీకి...అక్కడ కుమార్తె కనిపించకపోవడంతో ఇరుగుపొరుగు వారిని వాకబు చేసింది. చీరలు తెచ్చుకుంటానని బయటకు వెళ్లిందని వారు చెప్పడంతో అనుమానం వచ్చి అమీరుద్దీన్‌ఖాన్ ఎక్కడ ఉన్నాడో తెలుసుకుంది. అమీరుద్దీన్‌ఖాన్‌కు వడ్లపూడిలో స్నేహితుడు ఉన్నాడు. గత రెండు వారాలుగా అతడి వద్దకు వచ్చి వెళుతున్నాడు. శుక్రవారం అమీరుద్దీన్, బాలిక అక్కడకు వెళ్లారు. కుమార్తెను వెతుకుతూ జయశ్రీ వడ్లపూడిలోని అమీరుద్దీన్‌ఖాన్ స్నేహితుడికి ఇంటికి చేరింది. తలుపులు మూసి ఉండడంతో కిటికీలోంచి చూడగా, కుమార్తెతో పాటు అమీరుద్దీన్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించి, కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కొయ్యూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొండగోకిరి సమీపంలో శుక్రవారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో కాకరపాడుకు చెందిన మరిచెర్ల లోవ, గొలుగొండ మండలం రామచంద్రపురానికి చెందిన కోలా దేవిశ్రీప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. రామచంద్రపురానికి చెందిన పదో తరగతి విద్యార్థి దేవిశ్రీ ప్రసాద్ కృష్ణాదేవిపేటలో ట్యూషన్‌కు వెళ్లి స్కూటీపై తిరిగి ఇంటికి వెళుతుండగా.. లింగంపేట అత్తవారి ఇంటి నుంచి కాకరపాడు బైక్‌పై వెళుతున్న లోవ బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు క్షతగాత్రులను హుటాహుటీన కృష్ణాదేవిపేట పీహెచ్‌సీకు తరలించారు. ప్రథమ చికిత్సనంతరం వైద్యుల సూచన మేరకు అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి తలలకు బలమైన గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

గొలుగొండ మార్చి, 28 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామారావు శుక్రవారం తెలిపారు. మండలంలోని సాలికమల్లవరం గ్రామానికి చెందిన కోరెడ్డి జ్యోతి ఈనెల 26వ తేదీన సాలికమల్లవరం గ్రామం (పుట్టింటి) నుంచి మాకవరపాలెం మండలం తాడపాడలోని అత్త ఇంటికి బయలుదేరినట్టు కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. ఆమె అత్తవారి ఇంటికి చేరకపోవడంతో అనుమానంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

కొత్తమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో చోరీ

మునగపాక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మునగపాకలోని కొత్తమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో చోరీ జరిగింది. ఈ సంఘటనపై పురిటిగెడ్డ మూల సంఘం రైతులు వేగి పరదేశినాయుడు, బుద్ద వెంకటి, వేగి నాయుడు మాట్లాడుతూ... గురువారం సాయంత్రం రైతులంతా ఇళ్లకు వెళ్లిపోయిన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి అమ్మవారి విగ్రహానికి అలంకరించిన వెండి చెవి ఆభరణాలు, మైక్‌సెట్, హుండీలో నగదు పట్టుకుపోయారన్నారు. ఈ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వారు చెప్పారు.

బీఆర్‌టీ కాలనీలో వివాహిత అదృశ్యం

అనకాపల్లి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం పిసినికాడ పంచాయతీ బీఆర్‌టీ కాలనీకి చెందిన ఒక వివాహిత అదృశ్యమైంది. ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపిన వివరాలిలా వున్నాయి. బీఆర్‌టీ కాలనీకి చెందిన అనపర్తి దుర్గా విజయలక్ష్మి తన ఇద్దరి పిల్లలతో కలిసి ఈ నెల 25వ తేదీన అదే కాలనీలో ఉంటున్న తల్లి తోట పద్మ ఇంటికి వచ్చింది. 26వ తేదీ ఉదయం పిల్లలను స్కూల్‌లో దిగబెట్టడానికి వెళ్లిన విజయలక్ష్మి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తోట పద్మ గురువారం రాత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నకిలీ ఏసీబీ అధికారి అరెస్టు

మునగపాక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ అధికారిని అంటూ పలువురు ప్రభుత్వ అధికారులకు బెదిరించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. అనంతపురం ప్రాంతానికి చెందిన మల్లికార్జున్ అనే వ్యక్తిపై 2021లో జిల్లాలో పలువురు అధికారులకు ఫోన్‌చేసి, తాను ఏసీబీ అధికారినని, అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే సిబ్బందితో కలిసి దాడులు చేస్తానని బెదిరించాడు. దీంతో అప్పట్లో మునగపాక పోలీసులకు ఫిర్యాదులు అందడంతో కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని శుక్రవారం అరెస్టు చేశారు. అతని నుంచి రూ.1.3 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

713 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

ముంచంగిపుట్టు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాకవరంలో ఓ కిరాణా దుకాణంలో భారీగా మద్యం సీసాలను స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. మాకవరంలో అనధికారికంగా మద్యం విక్రయాలు సాగుతున్నట్టు పక్కా సమాచారం రావడంతో పోలీసులు ఒక కిరాణా దుకాణంలో తనిఖీలు చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఆంధ్రాకు చెందిన బ్రాండ్స్ 30 మద్యం బాక్స్‌ల్లో బీర్లు, చీప్ లిక్కరు, తదితర 713 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.1.13 లక్షలు ఉంటుందన్నారు. మద్యం విక్రయిస్తున్న మహేశ్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఒకటిన పదో తరగతి సాంఘిక శాస్త్రం పరీక్ష

అనకాపల్లి రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఏప్రిల్ ఒకటో తేదీన సాంఘిక శాస్త్రం పరీక్ష యథావిధిగా ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ పర్వదినం ఈనెల 31వ తేదీ సోమవారం జరుగుతున్నందున పరీక్షను మంగళవారం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించి, ఆదేశాలు జారీ చేసినట్టు వివరించారు.

ఏసీబీ వలలో నక్కపల్లి ఆర్ఐ

... 3వ పేజీ తరువాయి

తమ వ్యవసాయ పొలంలో బోరు వేయించుకోవడానికి వాల్టా చట్టం కింద అనుమతి కోసం వారం రోజుల కిందట తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు అందజేశారు. దీనిని పరిశీలించిన ఇన్‌చార్జి ఆర్ఐ మోటకట్టు కన్నబాబు, ఒక్కో రైతు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.15 వేలు లంచంగా డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేమని రైతులు చెప్పగా.. వెయ్యి చొప్పున తగ్గించి రూ.12 వేలు ఇస్తేనే అనుమతి పత్రం జారీ చేస్తానని చెప్పాడు. దీంతో రైతులు విశాఖలోని ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారు చెప్పిన మేరకు రైతులు శుక్రవారం మధ్యాహ్నం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ఆర్ఐ కన్నబాబుకు రూ.12 వేలు ఇచ్చేరు. అప్పటికే సమీపంలో మాటు వేసిన ఏసీబీ అధికారులు కార్యాలయంలోకి వచ్చి కన్నబాబును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కన్నబాబు నుంచి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. శనివారం విశాఖలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామని డీఎస్పీ చెప్పారు. బాధిత రైతులు తమ పేర్లు బహిర్గతం చేయవద్దని విజ్ఞప్తి చేసినందున వారి వివరాలను వెల్లడించడంలేదని ఆమె తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్పీతోపాటు సీఐలు సీహెచ్ లక్ష్మణరావు, పి.శ్రీనివాసరావు, బి.సుప్రియ, వైకే కిశోర్‌బాబు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	94.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	198.00
స్కిన్ లెస్	208.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	445
విజయనగరం	449
శ్రీకాకుళం	449